# తెలంగాణ లెజెండ్

THE VOICE OF THE TELANGANA

(ది వాయిస్ ఆఫ్ ది తెలంగాణ)....

తెలుగు దినపత్రిక

మహబూబ్ నగర్ | సంపుటి : 8 సంచిక : 170 | శుక్రవారం, జులై 4, 2025 | పేజీలు : 8 వెల : 2/-


# సామాజిక న్యాయ సమరభేరి....

**హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నిక ల్లో గెలుపే లక్షంగా కేడర్‌కు ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిశానిర్దేశం చేయనున్నారు. ఈ నేపథ్యంలో నే నేడు ఎల్బీ స్టేడియంలో గ్రామ స్థాయి నేతల సమ్మేళనానికి ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ ఖర్గే సభకు 'సామాజిక న్యా య సమర భేరీగా' కాంగ్రెస్ వర్గాలు నామకరణం చేశా యి. నేడు మధ్యాహ్నం 3 గంటలకు ఎల్బీ స్టేడియంలో ఈ సమ్మేళనం జరుగుతుంది. జైబాపు, జైంభీం, జై సంవిధాన్‌లో భాగంగా ఖర్గే సభ జరుగుతుందని పిసిసి వర్గాలు పేర్కొన్నాయి. ఇంకా ఈ సమావేశానికి ఏఐసిసి నాయకురాలు,పార్టీరాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా ముఖ్య నేతలు హాజరవుతున్నారు. ఈ ఖర్గే సభకు 'సామాజిక న్యా య సమర భేరీగా' కాంగ్రెస్ వర్గాలు నామకరణం చేశా యి. నేడు మధ్యాహ్నం 3 గంటలకు ఎల్బీ స్టేడియంలో ఈ సమ్మేళనం జరుగుతుంది. జైబాపు, జైంభీం, జై సంవిధాన్‌లో భాగంగా ఖర్గే సభ జరుగుతుందని పిసిసి వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు చేపట్టాల్సిన అంశాలు, పార్టీ కేడర్‌కు తీసుకోవాల్సిన పటిష్టత గురించి గ్రామస్థాయి నాయకులకు ఖర్గే సూచనలు చేయనున్నారు. పార్టీ గెలుపు కోసం విభేదాలను విడనాడి గెలుపే లక్షంగా ముందుకెళ్లాలని ఖర్గే కేడర్‌కు పలు సూచనలు చేయనున్నారు.



# భారత్ ఫ్యూచర్ సిటీ...దేశానికి కానుక



**మహేశ్వరం :** తెలంగాణ రాష్ట్రం పరిశ్రమలకు కేరాఫ్‌గా నిలుస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ పరిశ్రమ సరైన సమయంలో సరైన ప్రాంతాన్ని ఎంచుకుందంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రం పరిధిలోని తుక్కుగూడ సమీపంలో మలబార్ గోల్డ్ అండ్ డై మండ్స్ సంస్థ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు కేరాఫ్‌గా మారిందన్నారు. అభివృద్ధిలో తెలంగాణ, కేరళ, తమిళనాడు పోటీపడుతున్నాయ న్నారు. హైదరాబాద్ నగరం వాణిజ్య కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. మహేశ్వరం ప్రాంతం ఫోర్త్ సిటీ వెలుగులు సంతరించుకుంటోందని ఆయన అన్నారు. 30వేల ఎకరాలలో మరో మహానగరం రూపుదిద్దుకుంటోందని ఆయన తెలిపారు. కులీకుతుబ్‌షాహీలు హైదరాబాద్ నిర్మాణం చేపట్టగా నిజాం నవాబులు హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలను వెలుగులోకి తెచ్చారన్నారు. తదనంతరం నాటి సిఎంలు చంద్రబాబు నాయుడు, రాజశేఖర్‌రెడ్డిలు సైబరాబాద్‌కు జీవంపోశారని ఆయన గుర్తుచేశారు.

# అంగన్‌వాడీ హెల్పర్లకు శుభవార్త



**హైదరాబాద్ :** అంగన్‌వాడీ హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి పొందే గరిష్ట వయోపరిమితి నీ 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సంబంధిత ఫైలుపై గురువారం సంతకం చేశారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు గల సుమారు 4,322 మంది అంగన్వాడీ హెల్పర్లకు టీచర్లుగా పదోన్నతి పొందే అవకాశం ఏర్పడనుంది. గతంలో 45 ఏళ్లు దాటిన తర్వాత ప్రమోషన్ కోసం అవకాశాలు లేకపోయినా, ఇప్పుడు వారికీ మళ్ళీ అవకాశం లభించనుంది. గరిష్ట వయో పరిమితిని పెంచాలని అంగన్వాడి హెల్పర్ యూనియన్ల విజ్ఞప్తి మేరకు సాధ్యసాధ్యాలను పరిశీలించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. అర్హతలు ఉన్న 50 ఏళ్ల లోపు హెల్పర్లకు టీచర్ పదోన్నతి ఇవ్వడంలో ఎలాంటి అడ్డంకులు లేవని అధికారులు నివేదిక సమర్పించారు. ఇటీవలే అంగన్వాడీ టీచర్ల రిటైర్మెంట్ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో 50 ఏళ్ల వయసులో టీచర్ గా పదోన్నతి పొందే హెల్పర్లు ఇంకా 15 ఏళ్లు విధులు నిర్వర్తించవచ్చని సూచించారు. 45 సంవత్సరాల వయస్సు దాటిన అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వడంలో ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు స్పష్టం చేయడంతో ఫైలుపై మంత్రి సీతక్క సంతకం చేశారు. దీంతో త్వరలో అధికారిక ఉత్తర్వులు వెల్లడి కానున్నాయి. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది అంగన్‌వాడీ హెల్పర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కేవలం వయస్సు కారణంగా తాము టీచర్లుగా ప్రమోషన్ కోల్పోతున్నామని బాధపడిన తమకు సీతక్క న్యాయం చేశారని తెలిపారు. అంగన్‌వాడీల బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అంగన్‌వాడీల బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు.

# మౌనం మాటున కుట్ర



**హైదరాబాద్ :** ఎంత పెరిగినా గొర్రెకు బెత్తడే తోక అన్నట్టు ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ సాధించింది ఏం లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. లోక్‌సభలో ప్రతి పక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న రాహుల్ గాంధీ, తెలంగాణ సమస్యలు, ఈ ప్రాంతానికి హక్కుగా రావాల్సిన అంశాల మీద ఏ రోజు కూడా మాట్లాడలేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణకు ద్రోహం చేయడంలో బిజెపితో రాహుల్ గాంధీ కలిసి పనిచేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రైతుల నోట్లో మట్టి కొట్టే బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాహుల్ మౌనంగా ఉండడం ముమ్మాటికి కుట్రే అని పేర్కొన్నారు. గోదావరి లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాను తన గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ధారాదత్తం చేస్తుం టే ఆపకుండా రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 2014 పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుపై నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఇప్పటి వరకు రాహుల్ గాంధీ ప్రశ్నించలేదని గుర్తుచేశారు. కాళేశ్వరం లేదా పాలుమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హొదా, బయ్యారం ఉక్కు ఫ్యా క్టరీ గురించి కేంద్రాన్ని రాహుల్ ఎందుకు నిలదీయడం లేదో చెప్పాలని అడిగారు. విభజన చట్టంలో ఉన్న ఐటి ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటిఐఆర్)ను 2015లోనే మోడీ ప్రభుత్వం రద్దు చేస్తే రాహుల్ గాంధీ మాట మాట్లాడకుండా కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికారన్నారు. విషయంలో కూడా రాహుల్ వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మరిచిపోలేదని చెప్పారు. బొగ్గు బ్లాక్‌లను కేటాయించకుండా తెలంగాణ కొంగు బంగారం సింగరేణి అస్థిత్వాన్నే మాయం చేయాలనుకున్న మోడీ ప్రభుత్వ కుట్రలపై రాహుల్ గాంధీ ఏ రోజు కూడా లోక్ సభలో మాట్లాడలేదన్నారు.

# కెసిఆర్‌కు అస్వస్థత



**హైదరాబాద్ :** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు గురువారం సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల కోసం తన సతీమణి శోభ, కుమారుడు కెటిఆర్‌తో కలిసి కెసిఆర్ యశోద ఆసుపత్రికి వెళ్లారు. బిఆర్ఎస్ పార్టీ నేతలు హరీశ్‌రావు, జోగినపల్లి సంతోష్ కుమార్ కూడా ఆసుపత్రికి వెళ్లారు. కెసిఆర్‌కు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇది కేవలం రెగ్యులర్ హెల్త్ చెకప్‌లో భాగమేనని తెలిపారు. కాగా, కొద్ది రోజుల క్రితం జనరల్ హెల్త్ చెకప్‌లో భాగంగానే కెసిఆర్ గచ్చిబౌలిలోని ఎఐజి ఆసుపత్రికి వెళ్లిన విషయం తెలిసిందే. నిలకడగా కెసిఆర్ ఆరోగ్యం: హెల్త్ బులిటెన్‌లో వైద్యుల యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెసిఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ మేరకు గురువారం రాత్రి యశోద ఆసుపత్రి సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎం.వి.రావు హెల్త్ బులిటెన్ విడుదల చేశారు.

# కేసిఆర్ ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా!



**హైదరాబాద్ :** అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. ఆయన ఆసుపత్రిలోని వైద్యులతో మాట్లాడి కేసిఆర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. చంద్రశేఖర్ రావు త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# కెసిఆర్ అసెంబ్లీకి రావాలి...!

**హైదరాబాద్ :** కెసిఆర్ అసెంబ్లీకి రావాలని, ఆయన వస్తే అన్ని అంశాలపై చర్చ జరుపుతామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. హరీష్ రా వు, కెటిఆర్‌తో తమకు సంబంధం లేదని వాళ్లు లెక్కలోకి రారని, కెసిఆర్‌తోనే తమకు లెక్క అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అ న్నారు. కెసిఆర్, తాము ఉద్యమంలో పనిచేశామని, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ఆయన అన్నారు. హరీష్ రావు ఉత్తి ఎమ్మెల్యే మాత్రమే అని, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కాదని కోమటిరెడ్డి అన్నారు. ప్రతిపక్ష నేతగా కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి తమ తప్పు, ఒప్పులను చెప్పాలని మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశా రు. కెసిఆర్ సలహాలు ఇస్తే స్వీకరిస్తామని, తప్పులను చూపిస్తే సరిదిద్దుకుంటామని ఆయన పేర్కొన్నారు.



# బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ కు జన్మదిన శుభాకాంక్షలు

## – బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



**షాద్ నగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి :** భారతీయ జనతా పార్టీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు రాజ్య సభ సభ్యులు లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్ రెడ్డి గతంలో లక్ష్మణ్ నాయకత్వం లో తెలంగాణా విమోచన కమిటీ చైర్మన్ గా నాకు అవకాశం ఇచ్చారని, అప్పుడు నిర్వహించిన విమోచన యాత్ర ద్వారా తెలంగాణా లోని ప్రతీ గ్రామానికి చరిత్ర తీసుకువెళ్లే విధంగా, ఢిల్లీ స్థాయిలో తెలంగాణా విమోచన చరిత్ర తెలిసే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తుచేసుకున్నారు. మోడీ గారి ప్రభుత్వం తెలంగాణా విమోచన దినోత్సవాన్ని అధికారికంగా చేపట్టడంలో అనేక బీజేపీ నాయకుల పోరాటంలో చివరిగా లక్ష్మణ్ గారి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. వారి జన్మదినం సందర్భంగా ఆ భగవంతుడు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలు ప్రసాదించాలని బీజేపీ లో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని శ్రీవర్ధన్ రెడ్డి కోరారు.

# రూ. 3.50 కోట్ల సీసీ రోడ్డు పనుల శంకుస్థాపనకు అందరూ హాజరుకండి...



## – ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## – 6వ వార్డు మాజీ కౌన్సిలర్ లతా శ్రీశైలంగౌడ్

**షాద్ నగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి :** అభివృద్ధి పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో మూడు కోట్ల పైచిలుకు నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆరో వార్డు మాజీ కౌన్సిలర్ లతా శ్రీశైలం గౌడ్ దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై భూమి పూజలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆరోవార్డు లోని ప్రజలతోపాటు పట్టణంలోని నాయకులు అధికారులు హాజరు కావాలని కోరారు.

# చిన్న చిలకమర్రి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థికు టై బెల్టులు పంపిణీ...

## – దాతలు నరసింహారెడ్డి, యాదయ్యల సహకారంతో పంపిణీ చేసిన హెచ్ ఎం



**షాద్ నగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి :** ఫరూక్ నగర్ మండల పరిధిలోని చిన్న చిలకమర్రి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం టై బెల్టులు పంపిణీ చేశారు. దాతలు పల్లె నర్సింహారెడ్డి, తెలుగు యాదయ్యలు విద్యార్థులకు తమ వంతు సహకారంగా టై బెల్టులను అందజేసి గొప్ప మనసును చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కృష్ణయ్య మాట్లాడుతూ... విద్యార్థులకు యూనిఫామ్ తో పాటు టై బెల్టులు బూట్లు ఉంటే ఆకర్షణీయంలో ఉండటమే కాకుండా ఆత్మవిశ్వాసంతో అభ్యసన ప్రక్రియల్లో చురుకుగా పాల్గొంటారని, న్యూన్యత భావం తొలగిపోతుందన్నారు. అదేవిధంగా టై బెల్టులు ప్రధానం చేసిన దాతలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపించటానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నాగిళ్ల జగదీశ్వర్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీల ఐక్యతే రాజ్యాధికారానికి బలమవ్వాలి!

## – గంగన్నగూడలో మహిళా బీసీ సేన కమిటీ ఏర్పాటుతో మారుమూల గ్రామాన ఆశాజ్యోతి
## – బీసీల హక్కుల సాధనకై కమిటీల విన్యాసం
## – కొందుర్గు మహిళా అధ్యక్షురాలు అనిత శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో



**కొందుర్గు జూలై 03(తెలంగాణ లెజెండ్) :** – రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం గంగన్నగూడ గ్రామంలో జాతీయ బీసీ సేన మహిళా విభాగం ఆధ్వర్యంలో గ్రామ కమిటీ ఏర్పాటు వేడుక ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మండల మహిళా బీసీ సేన అధ్యక్షురాలు వీరపురం అనిత శేఖర్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు మేకల వెంకటేష్ ముదిరాజ్, షాద్‌నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, నందిగామ మండల ఉపాధ్యక్షులు మొలగాసి నరసింహులు, కొందుర్గు మండల అధ్యక్షులు ఐలాపురం రమేష్, మండల ఉపాధ్యక్షులు గౌరి శంకర్ హాజరై సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. వారు మాట్లాడుతూ... బీసీలను అన్ని రంగాలలో వెనక్కు నెట్టి అణిచివేయడమే కాకుండా, సమానత్వాన్ని లాఘవం చేస్తూ పాలక వర్గాలు నడుచుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి బీసీ ఒక్కటై, రాజ్యాధికారాన్ని సాధించాలన్న దీక్షతో ముందుకు సాగాలి, అని స్పష్టం చేశారు. గ్రామ గ్రామానికి కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా బీసీల ఆత్మగౌరవ ఉద్యమానికి నూతన దిశ చూపించాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకారం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా గంగన్నగూడ గ్రామ మహిళా కమిటీని ప్రకటించారు: అధ్యక్షురాలిగా: కమ్మరి ఈశ్వరి, ఉపాధ్యక్షురాలిగా: కల్లాల చంద్రకళ గౌడ్, ప్రధాన కార్యదర్శి: కొత్తగాడి జయమ్మ ముదిరాజ్, కార్యదర్శి: చాకలి పద్మ, ప్రచార కార్యదర్శి: పిచ్చకుంట్ల యాదమ్మ, సహాయ కార్యదర్శి: గౌసియా బేగం, కోశాధికారిగా: కుమ్మరి సంతోష కమిటీ సభ్యులకు అధికారికంగా నియామక పత్రాలు అందజేయడం జరిగింది. అనంతరం మహిళా నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సభ ముగింపున విశేషమైన హర్షాతిరేకాలు, నినాదాలతో బీసీ సేనకు మద్దతు ప్రకటించారు.

# విద్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

## – బాలానగర్ మండల కేంద్రంలో పర్యటించిన అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



బాలానగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి : విద్యను అభ్యసించే విద్యా ప్రాంగణాలను సంబంధిత అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందని అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) శివేంద్ర ప్రతాప్ అభిప్రాయపడ్డారు. గురువారం ఈ మేరకు బాలనగర్ మండల కేంద్రంలో పర్యటించి గ్రామంలోని ప్రతి విద్య కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం, బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ఎస్సీ బాలుర వసతి గృహంను పరిశీలించారు. ఆయా పాఠశాలలకు సంబంధించిన పరిసర ప్రాంతాలకు సంబంధించిన శుభ్రత కార్యక్రమాలను పరిశీలించి సంబంధిత అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా పరంగా పరిశుభ్రంగా ఉంచవలసిన బాధ్యత సంబంధిత అధికారులదన్నారు. ఈ కార్యక్రమం మండల తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ విజయ కుమారి, జిల్లా, మండల విద్యా అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

# "ఎంపీ డీకే అరుణ - ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేతుల మీదుగా సైన్స్ ల్యాబ్ & అదనపు తరగతి గదుల ప్రారంభం"

## - పీఎంశ్రీ నిధులతో విద్యా వసతుల బలోపేతం - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కలయికలో భవనాలు సిద్ధం
## - విద్యాభివృద్ధిలో మరో మెట్టు - జడ్చర్లకు నవోదయ కోరిన అనిరుద్ రెడ్డి
## - విద్యార్థుల భవిష్యత్తు బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది - ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**రాజాపూర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి :** రాజపూర్ మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో అధునాతన సైన్స్ ల్యాబ్ %డ% అదనపు తరగతి గదుల నిర్మాణానికి పీఎం శ్రీ నిధుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన మద్దతుతో ఇవాళ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ, జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై, విద్యార్థులకు ఉపయోగపడే తరగతి గదులు, సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జడ్చర్ల నియోజకవర్గానికి ఒక నవోదయ స్కూల్ మంజూరు చేయించాలని ఎమ్మెల్యే ఎంపీ అరుణమ్మ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులలోని నాయకత్వ లక్షణాలకు వేదిక.. కౌన్సిల్ ఎన్నికలు




## - సమాజ సంక్షేమానికి దోహదపడే కార్యక్రమాలకు నెలవు విద్యాసంస్థలే
## - కమ్మదనం గురుకుల పాఠశాలలో సజావుగా సాగిన స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు..
## – కమ్మదనం స్టూడెంట్ ఎన్నికల ఫలితాలు



పాఠశాల కౌన్సిల్ ఎన్నికలు విద్యార్థుల జీతంలో ఒక ముఖ్యమైన భాగమని,స్టూడెంట్ కౌన్సిల్ నియామకం యొక్క లక్ష్యం పాఠశాల కార్యకలాపాలు మరియు సేవా ప్రాజెక్టులను నిర్వహించడం ద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి ఒక వేదికను అందించడం అని ప్రిన్సిపాల్ విద్యుల్లత అన్నారు.సోమవారం రంగారెడ్డి జిల్లా కమ్మదనం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలో స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో సజావుగా నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఎలక్షన్ కమిషన్ సభ్యులుగా ప్రిన్సిపాల్ విద్యుల్లత, చంద్రకళ,శిరీష %ఇ% ప్రవళిక రిటర్నరింగ్ అధికారులుగా వై జె సుసన్న,రూట్ అధికారిణిగా స్వప్న, రమ్య భార్గవి నాగమణిలు వ్యవహరించారు.రెండు పోలింగ్ బూతులను రెండు ఏర్పాటు చేశామన్నారు.పోలింగ్ బూతులలో విద్యార్థులు ఎంతో ఉత్సహంతో ఓటు వేసారన్నారు. స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్,సాంస్కృతిక కార్యదర్శి,క్రీడా కార్యదర్శి,విద్యాకార్యదర్శుల కోసం ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. 97% పోలింగ్ జరిగినట్లు ఎలక్షన్ కమిషన్ విద్యుల్లత మీడియా కు తెలిపారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ విద్యుల్లత మాట్లాడుతూ.. పాఠశాల స్ఫూర్తికి మరియు సమాజ సంక్షేమానికి దోహదపడే కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు,స్టూడెంట్ కౌన్సిల్ విద్యార్థి సంఘం యొక్క స్వరం. వారు విద్యార్థుల ఆలోచనలు, ఆసక్తులు మరియు ఆందోళనలను పాఠశాల వ్యాప్తంగా ఉన్న సమాజంతో పంచుకోవడానికి సహాయపడతారు. ఎలక్షన్స్ అంటే ఏమిటీ,ఏ విధంగా ఎన్నికలు నిర్వహిస్తారో ఈరోజు నిర్వహించిన స్కూల్ కౌన్సిల్ ఎన్నికల ద్వారా విద్యార్థులకు సూచించామని జరిగిందన్నారు. ఈ కౌన్సిల్ ఎన్నికల్లో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి తోడ్పడిన ఉపాధ్యాయ,అధ్యాపక బృందాన్ని ఎలక్షన్ కమిషన్ కమిషన్ అధికారి,ప్రిన్సిపల్ శ్రీమతి విద్యుల్లత అంతేకాకుండా ఈరోజు విజేతలను నిర్ణయించి వారికి సరైన సూచనలను గురించి పాఠశాల యొక్క భద్రతను గురించి తెలియజేస్తూ విద్యార్థులను ప్రశంసించారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు గారిని సన్మానించిన...

## – బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్,గా.
## – బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య..



**షాద్ నగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు గారిని ఆయన నివాసంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ గారు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య గారు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి బోకె ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారుఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాజ్ భూపాల్ గౌడ్.అందే బాబయ్య మాట్లాడుతూ "రాష్ట్రంలో బీజేపీకి విశాల భవిష్యత్ ఉంది. రామచందర్ రావు గారి నేతృత్వంలో పార్టీ మరింత శక్తివంతంగా ఎదుగుతుంది. పార్టీ పట్ల ఆయన అంకితభావం, కార్యశీలత కార్యకర్తలకు ప్రేరణగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు హరిభూషణ్,బోయ కురుమయ్య, పసుపుల ప్రశాంత్, రఘురాములు గౌడ్, మోటీ శ్రీను, జమ్ముల నర్సింహ, పద్మ కృష్ణయ్య, గట్టోజు విజయ్ శంకర్ రెడ్డి, రవి నాయక్,శ్రీనివాస్ గౌడ్ తదితరులు కూడా రామచందర్ రావు గారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.



# డాక్టరేట్ అందుకున్న వంగూరి యాదవ రెడ్డికి ఘన సత్కారంలి

## - ఘనంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమం
## - మానవతా విలువలకు నిలువెత్తు నిదర్శనం వంగూరి యాదవ రెడ్డి







**షాద్ నగర్ తెలంగాణ లెజెండ్ ప్రతినిధి :** ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ అందించిన గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న ప్రముఖ హ్యూమనిస్ట్, సామాజిక కార్యకర్త వంగూరి యాదవ రెడ్డి ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సగ్గు వేణుమాధవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు మాట్లాడుతూ వంగూరి యాదవ రెడ్డి మానవతా విలువలకు జీవ రూపం. కుల, మత, ప్రాంత భేదాలను త్రోసి, ప్రతి ఒక్కరిని సమానంగా ప్రేమించే తత్వాన్ని ఆయన అలవర్చుకున్నారు. సామాజిక సేవ అంటే ఆదర్శం ఎలా ఉండాలో ఆయన చూపించారు. గౌరవ డాక్టరేట్ ఆయన సేవలకు సముచిత గుర్తింపు అని ప్రశంసించారు. ఇక సగ్గు వేణుమాధవ్ మాట్లాడుతూ.. ఈ తరం యువతకి వంగూరి గారి జీవితం ఒక మార్గదర్శక శక్తి. నిస్వార్థంగా సేవ చేసే వ్యక్తులకు ఈ సమాజం గౌరవం ఇచ్చే రోజు వచ్చింది. ఇది మానవ హక్కుల పోరాటానికి నూతన స్ఫూర్తినిస్తుంది," అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వంగూరి యాదవ రెడ్డి కి శాలువా కప్పి, సన్మాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు సామాజిక కార్యకర్తలు, ఫరూఖ్‌నగర్ మాజీ వార్డ్ మెంబర్ సగ్గు సాయికుమార్, బెంజు సరియా పేపర్ మిల్ ఉద్యోగి రమణయ్య, సత్యనారాయణ గుప్తా, డేవిడ్ కాటేపాగ వినయ్ కుమార్ ,న్యాయవాదులు, యువత తదితరులు పాల్గొన్నారు. ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ పలువురు ప్రసంగించారు. సమాజ మార్పుకు కట్టుబడిన వంగూరి యాదవ రెడ్డికి గౌరవ డాక్టరేట్ రావటం నిజమైన సామాజిక న్యాయానికి సంకేతంగా పలువురు భావిస్తున్నారు.

# అసంపూర్ణంగానే సింగరేణి క్వార్టర్ల పట్టాలు




**ఆదిలాబాద్ :** బెల్లంపల్లిలో పురాతన సింగరేణి క్వార్టర్ల పట్టాల ప్రక్రియ అసంపూర్ణంగానే మిగిలిపోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బెల్లంపల్లిలోని బొగ్గు గనులతో వెలసిన తొలితరం సింగరేణి క్వార్టర్లకు పట్టాలిచ్చా రు. 4500 క్వార్టర్లను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీంతో ఈ క్వార్టర్లు రెవెన్యూ ఆధీనంలోకి మారిపోయా యి. పట్టాల అందజేత గత ఎన్నికల ముం దు మొదలైంది. దీంతో అసంపూర్ణంగానే ఈ ప్రక్రియ ఆగిపోయింది.కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక బెల్లంపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన గడ్డం వినోద్ పట్టాల ప్రక్రియను పూర్తి చేస్తానని చెప్పారు. అయితే ఆయన హాయం లో కూడా పట్టాల నమోదు కొంతమేరకు చేపట్టి పూర్తి చేయలేకపోయారు. దీంతో పట్టాల వ్యవహారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే చందంగా ఉండిపోయింది. పట్టాల ప్రక్రియ పరిపూర్తి కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి పట్టాల ప్రక్రియను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సింగరేణి యాజమాన్యం సరెండర్ చేసిన సింగరేణి క్వార్టర్లకు పట్టాలు పూర్తిస్థాయిలో ఇవ్వాలి. కానీ మధ్యలోనే వాటికి ఎగనామం పెట్టడంతో ఇళ్ల పట్టాల సమస్య అపరిష్కృతంగా మిగిలిపోయింది.సింగరేణి క్వార్టర్లు సొంతం కావడంతో కార్మికుల్లో ఎనలేని ఆనందం వ్యక్తం అవుతున్నది. ఇదే తరుణంలో అసంపూర్ణంగా మిగి లిపోవడంతో పట్టాలు చేతికందక మిగితా కార్మికులు బాధను కూడా వ్యక్తం చేస్తున్నా రు. ప్రకటించిన నివాస పట్టాలు యావత్ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందకుండా నే ముగించారు. మరో దఫా పట్టాల నిర్వహణను చేపడతారని ఎదురుచూస్తున్నారు. పూర్తిస్థాయిలో పట్టాలను చేపట్టకుండా మ ధ్యంతరంగా ముగించడం పట్ల లబ్ధిదారులు తెగ బాధపడి పోతున్నారు.ఇప్పటికైనా అధికారులు పెండింగ్‌లో ఉన్న పట్టాల వైపు దృ ష్టి పెట్టాలని కోరుతున్నారు. పట్టాలు పొం దని కార్మికులు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సౌకర్యాన్ని కోల్పోతున్నారు. ఇప్పటివరకు సింగరేణి సంస్థ నుంచి పొందుతున్న విద్యు త్ సదుపాయం ఎంతకాలం ఉంటుందో తెలియదు. ఎంతకాలం సింగరేణి విద్యుత్తు ఉంటుందో? ఎప్పుడు తొలగిస్తారో ఆందోళనలో కార్మికులు కాలం వెళ్లదీస్తున్నారు.ఇళ్ల పట్టాలను నోచుకోని సింగరేణి కార్మికులకు ప్రత్యామ్నాయ విద్యుత్ సదుపాయం అందని ద్రాక్షగా మారింది. సింగరేణి నుంచి అప్పగించిన క్వార్టర్లకు పట్టాల ఘట్టం పరిపూర్తి కాలేదు. సింగరేణి కాలనీలో ప్రభుత్వ విద్యుత్తు సదుపాయం కల్పన కూడా ఇంకా పూర్తి కాలేదు. కొన్ని కాలనీలో విద్యుత్ స్తంభాలు వేసి వైరింగ్ చేశారు. మరి కొన్ని బస్తీ ల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాట్ల పనులే సాగుతున్నాయి. విద్యుత్ పనులు పాక్షికంగా జరిగాయి. పట్టాలు పొందని ఎంతోమంది లబ్ధిదారులు విద్యుత్తు సదుపాయాన్ని పొందలే కపోతారు. ఈ విషయాన్ని అధికారులు, ఎమ్మెల్యే తక్షణమే పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. సగానికి పైగానే సింగరే ణి క్వార్టర్లకు పట్టాలు పూర్తికాలేదు.పెండింగ్‌లో ఉన్న పట్టాల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. పట్టా లు కోసం మరోసారి అవకాశం ఇవ్వాలన్న ప్రజల విన్నపాలను లెక్కలోకి తీసుకోవాలి. ఇంతకు పూర్వం లబ్ధిదారుల్లో పట్టాల కోసం చేసుకున్న అప్లికేషన్లో చాలా వరకు సాంకేతిక కారణాల వల్ల రిజెక్ట్ అయ్యాయనీ వాపోతున్నారు. దీంతో ఇచ్చిన గడువులో నిర్ణీత కాలంలో పట్టాలు చేతికి రాకుండా పోయా యి. మెజార్టీగా తగినంత సమయం వెచ్చించకపోవడం వల్లనే లబ్ధిదారుడి చేతికి పట్టా అందలేకుండాపోయిందన్న వాదనలు ఉన్నాయి.ఈ రకంగా పట్టాల సమస్య బెల్లంపల్లిలో అసంపూర్ణంగా మిగిలిపోయింది. లబ్ధిదారులకు న్యాయం జరగాలంటే మరోసారి పట్టాల ప్రక్రియను చేపట్టాల్సిన అవ స రం ఎంతైనా ఉన్నది. ప్రజల కోసం, ప్రకటించిన ఇళ్ల పట్టాల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పట్టాలకు అవకాశం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపైనే ఉంది. ఇలా జరగ ని పక్షంలో వందలాది మంది ఇళ్లపట్టాలను కోల్పోవల్సివస్తుందనీ వాపోతున్నారు.మొక్కుబడిగా గత ప్రభుత్వం, ప్రస్తుత ఎమ్మె ల్యే పట్టాల అందజేతను హడావిడిగా కొనసాగించారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. దాని ఫలితంగానే పెండిం గ్లో పెద్ద ఎత్తున పట్టాలు మిగిలిపోయాయ న్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ప్రతి ఒక్కరికీ పట్టాలు చేతికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేపై ఎంతైనా ఉందన్న విషయాన్ని గుర్తించాలని కోరుతున్నారు.

# జనవరి 28 నుంచి తెలంగాణ కుంభమేళ



**వరంగల్ :** ములుగు జిల్లాలో కొలువుదీరిన మేడారం సమ్మక్క, సారలమ్మపై భక్తులకు ఎంతో విశ్వాసం. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర ఇక్కడ జరుగుతుంది. తాడ్వాయి మండల పరిధిలోని మేడారంలో ప్రతి రెండేళ్లకోసారి ఈ మహా జాతర నిర్వహిస్తారు. అయితే వచ్చే ఏడాది(2026)లో నిర్వహించే మహా జాతరకు సంబంధించి పూజారులు కీలక ప్రకటన విడుదల చేశారు. జాతర తేదీలను ప్రకటించారు. 2026 జనవరి 28 బుధవారం సాయంత్రం 6 గంటలకు సారలమ్మ అమ్మవారు గద్దెకు విచ్చేస్తారు. గోవింద రాజు, పగిడిద్ద రాజులు గద్దెలకు చేరుకుంటారు. 2026 జనవరి 29 గురువారం సాయంత్రం 6 గంటలకు సమ్మక్క అమ్మవారు గద్దెకు విచ్చేస్తారు. 2026 జనవరి 30 శుక్రవారం భక్తులు తమ మొక్కుబడులను సమర్పించుకునే ప్రత్యేక దినంగా ఉంటుంది. 2026 జనవరి 31 శనివారం సాయంత్రం 6 గంటలకు అమ్మవార్లు వనప్రవేశం తో జాతర ముగింపు ఘట్టం పూర్తవుతుందని పూజారులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ మేడారం జాతరలో ముఖ్యమైన ఘట్టం.. పగిడిద్దరాజను తీసుకురావడం. పగిడిద్దరాజును గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో మేడారానికి తీసుకువస్తారు. జాతరలో పగిడిద్దరాజుది ప్రత్యేక స్థానం. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని పూనుగొండ్లలో జాతరకు ఒకరోజు ముందు పగిడిద్దరాజును పెళ్లికొడుకును చేస్తారు. ఆ తర్వాత మరునాడు ఆలయానికి చేరుకొని, బలి, ప్రత్యేక పూజలు చేస్తారు. కొత్త దుస్తులతో పగిడిద్ద రాజును సిద్ధం చేసి మేడారానికి బయలుదేరుతారు. సాయంత్రానికి మేడారం చేరుకుంటారు. పగిడిద్దరాజును తీసుకొచ్చిన విషయాన్ని.. సమ్మక్క పూజారులకు కబురు పంపిస్తారు. అప్పటికే జాతర కోసం.. ఉదయం సమ్మక్క ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. కుంద రూపంలో ఉన్న సమ్మక్కను అలంకరిస్తారు. ఆ తర్వాత.. పగిడిద్ద రాజుకు ఆహ్వానం ఇస్తారు. వారిద్దరినీ ఎదురుదెరుగా కూర్చొబెట్టి.. వాయనం ఇచ్చిపుచ్చుకుని.. వివాహం పూర్తి చేస్తారు. పగిడిద్ద రాజును సారలమ్మ గద్దెల వద్దకు తీసుకుని పోతారు. అదే రోజు సారలమ్మకు కన్నేపల్లిలో ఉదయమే రెండు మూడు గంటలపాటు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడ నుంచి మేడారం తీసుకువస్తారు. గద్దెల నుంచి ఈ ప్రాంతం మూడు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సారలమ్మ గద్దెకు చేరుకునే రోజే తండ్రి పగిడిద్దరాజు ప్రత్యక్షం అవుతాడు. సారలమ్మ భర్త గోవిందరాజును సైతం.. ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామం నుంచి తీసుకువస్తారు. గ్రామస్తులంతా గోవిందరాజును తీసుకుని ఊరేగింపుగా మేడారానికి వస్తారు. ఒకే రోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులస్వామి గద్దెలపైకి చేరుకుంటారు. ఆ తర్వాత చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకుని వస్తారు. అధికార లాంఛనాలతో పోలీసుల తుపాకీ కాల్పుల గౌరవ వందనం, ఎదురుకోళ్ల ఘట్టంతో సమ్మక్కను ఆహ్వానిస్తారు. అయితే మేడారానికి ఈశాన్యంలో ఉన్న చిలకలగుట్టపై నారచెట్టుకింద ఉన్న కుంకుమ భరిణె రూపంలోని సమ్మక్క ఉంటుంది. ఆమెను కుంకుమ భరిణే రూపంలో పూజారులు తీసుకొస్తారు. అనంతరం గద్దెపై ప్రతిష్టిస్తారు. మేడారం జాతర మె?త్తానికి ఇదే కీలక ఘట్టం. ఈ తంతు తర్వాత ఉత్సవ మూర్తులంతా గద్దెలపై కొలువై మూడో రోజు భక్తులకు దర్శనం ఇస్తారు. అమ్మవార్లకు భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు. జాతరలో చివరి రోజున దేవతలను మళ్లీ వనంలోకి పంపిస్తారు. దేవతలు.. వనప్రవేశం చేయడంతో.. మేడారం మహాజాతర పరిపూర్ణం అవుతుంది. ఈ మేడారం జాతరకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తుంది. జాతర తేదీలు ఖరారైన తర్వాత? ప్రభుత్వాధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి నిర్వహణ కార్యక్రమాలపై మాస్టర్ ప్లాన్ రూపొందిస్తారు. కోట్లాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి? పకడ్బందీ ఏర్పాట్లు చేస్తారు. జంపన్న వాగుతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తుల కోసం మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తారు. ముఖ్యంగా శానిటేషన్ కోసం భారీగా సిబ్బందిని రంగంలోకి దించుతారు. భక్తుల రాకపోకల కోసం కూడా భారీగా ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచుతారు. హైదరాబాద్, వరంగల్ తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు బస్ స్టేషన్ల నుంచి ఈ జాతరకు వెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేస్తారు.

# లోకల్ బాడీ ఎన్నికలకు రెడీ



**హైదరాబాద్ :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో త్వరలోనే ఎన్నికల నగరా మోగనుందని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ఏడాది సెప్టెంబర్ 30లోపు పూర్తి చేయాలని హైకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణలో పల్లెల్లో త్వరలోనే ఎన్నికల జాతర మె?దలు కానుంది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వంటి స్థానిక సంస్థల ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు సీఎంను కలవగా.. వారితో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. త్వరలోనే రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గచ్చిబౌలి, బాగ్ లింగంపల్లిలోని తమ ట్రస్ట్ భవనాలకు పన్ను మినహాయింపు ఇవ్వాలని సీపీఎం నేతలు కోరగా.. ఈ విషయాన్ని పరిశీలిస్తానని సీఎం హామీ ఇచ్చారు. సేవాభావంతో పనిచేస్తున్నందున పన్ను మినహాయింపు ఇవ్వాలని సీపీఎం నేతలు కోరారు. కాగా, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు ఇటీవల కీలక తీర్పు వెలువరించింది. సెప్టెంబర్ 30, 2025లోపు సర్పంచ్ ఎన్నికలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలను సకాలంలో నిర్వహించడం లేదంటూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పును వెలువరించింది. ప్రభుత్వం 30 రోజులు, ఎన్నికల సంఘం 60 రోజులు సమయం కోరినప్పటికీ న్యాయస్థానం 90 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. తెలంగాణలో సర్పంచుల పదవీకాలం 2024 ఫిబ్రవరి 1న ముగియగా, మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఈ ఏడాది జనవరి 26న పూర్తయ్యింది. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీ, 50 శాతం రిజర్వేషన్లు మించకూడదన్న సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం రిజర్వేషన్లపై తర్జనభర్జన పడుతోంది. చట్టప్రకారం బీసీలకు రిజర్వేషన్ ఖరారు కాకుంటే పార్టీ తరపున అయినా అమలు చేయాలని భావిస్తోంది. అందుకు కసరత్తు సైతం మె?దలుపెట్టింది. ఇక ఇటీవల హైకోర్టు తీర్పుతో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతం అయింది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి సైతం స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక ప్రకటన చేయటంతో ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులు సమరానికి సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ దృష్టి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈనెల 4న హైదరాబాద్ కు రానున్నారు. ఎల్బీ స్టేడియంలో జరిగే గ్రామస్థాయి కార్యకర్తల స మావేశంలో ఆయన పాల్గొని దిశా నిర్దేశనం చేయనున్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేయడానికి నాయకులకు కార్యకర్తలకు పలు సూచనలు చేయనున్నారు. స్థానిక సమరానికి అధికార కాంగ్రెస్ పార్టీ సన్నద్ధం అవుతోంది. ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా సత్తా చాటి మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఆ మేరకు క్షేత్రస్థాయిలో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, కార్యక ర్తలను పార్టీ పెద్దలు అప్రమత్తం చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ నా యకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అన్ని స్థానాల్లో పార్టీ జెండా ఎగురవేయాలని, ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారుఈ మేరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుండి గ్రా మస్థాయి నుంచి కార్యకర్తలను ఖర్గే సభకు తరలించేందుకు నాయకులు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పీసీసీ ఇంచార్జి లుజిల్లాల్లో పర్యటించి ఈనెల 4న జరిగే సభ పై దిశా నిర్దేశం చేశారు. పార్టీని ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరింత బలోపేతం చేయడంతో పాటు నిర్మాణం చేసే దిశగా పిసిసి అడుగులు వేస్తున్న క్రమంలో జిల్లాలో పార్టీ పదవులు ఆశిస్తున్న నేతలు కార్యకర్తలను తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖర్గే సభకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కదిలి వచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఇటీవల పిసిసి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మన జిల్లాకి చెందిన నేతలు తమకు కేటాయించిన జిల్లాలో పర్యటించడమే కాకుండా తమ ప్రాంత పరిధి నుండి కార్యకర్తలను తరలించే దిశగా ప్రయత్నిస్తున్నారు. కరీంనగర్ జిల్లాకు సంబంధించి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రెండు రోజులుగా పార్టీ సమావేశాలు జరుగుతున్నాయి. సభకు ఇక్కడి నుండి భారీ సంఖ్యలో కార్యకర్తలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ ఇక్కడే మకాం వేసి కార్యకర్తలను సభకు సన్నద్ధం చేస్తున్నారు. సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అర్బన్ ప్రాంతం నుండి నాయకులతో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు కూడా పార్లమెంట్ పరిధిలోని నాయకులతో సమావేశమయ్యారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ సమావేశంలో పాల్గొని ఖర్గే సభకు కావలసిన ఏర్పాట్లకు హామీ ఇచ్చారు. మొత్తంగా ఖర్గే సభ అనంతరం గ్రామస్థాయిలో కార్యకర్తలు, నాయకులు రెట్టింపు పని చేసేందుకు సిద్ధం చేయాలని పార్టీనిర్ణయించింది.

# సౌకర్యాలు లేని కేజీవీబీలు...




**నిజామాబాద్ :** నిర్మల్ జిల్లాలో పేదరికంలో ఉన్న పిల్లల కోసం సర్వ శిక్ష అభియాన్ కింద ఏర్పాటు చేసిన కేజీబీవీ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు వరదల్లో వచ్చి పడుతున్నాయి. నిర్మల్ జిల్లాలో మొ త్తం 19 కేజీబీవీ ఉన్నాయి. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రవేశా లు కల్పిస్తున్నారు. 6 నుంచి 10 తరగతి వర కు ఉన్న పాఠశాలలో 240 మంది ఇంటర్ వరకు ఉన్న కేజీబీవీలో 340 మంది విద్యార్థులను చేర్చుకోవాల్సిన నిబంధన ఉన్న జిల్లా వ్యాప్తంగా ఈ విద్యాసంస్థల్లో ఆడపిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు పోటీ పడుతున్నారు. ప్రతి తరగతిలో 40 మంది విద్యార్థులు మాత్రమే చేసుకోవలసి ఉండగా స్థానికంగా ఉన్న పోటీ నేపథ్యంలో ఒక్కొక్క క్లాసులో 50 నుంచి 70 మంది వరకు విద్యార్థులు చదువుతున్నట్టు కేజీబీవీఎస్ఓ లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీలకు ప్రభుత్వ భవనాలు ఉన్నప్పటికీ అం దులో 240 మంది పాఠశాల స్థాయిలో 3 60 మంది కళాశాల స్థాయిలో వసతులు కల్పించవలసి ఉన్న పరిమితికి మించి విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడంతో కేజీబీవీలు విద్యార్థులతో కటకటలాడుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఐదవ తరగతి పాసైన బాలికలందరినీ గురుకులాల్లో రీయంట్రీ పరీక్ష రాయించిన అక్కడ సీట్లు తక్కువగా ఉండటంతో తిరిగి కేజీబీవీ వైపు మొగ్గు చూపుతున్నట్టు కేజీబీవీ ఉపాధ్యాయులు తెలిపారు.

జిల్లాలోని కేజీబీవీ పాఠశాలలో గత రెం డేళ్లుగా విద్యార్థుల అడ్మిషన్ల జోరుగా సాగుతున్నాయి. కేజీబీవీ పాఠశాలలో ఆడపిల్లల కు రక్షణగా ఉండడం, మంచి చదువు అం దించడం పోషక విలువలు ఆహారం ప్రతిరోజు వ్యాయామం ఆటలు ఇతర సామాజిక అంశాలపై ఆడపిల్లలకు విద్య అందించడం తో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు కేజీబీల వైపు మొగ్గు చూపేలా ప్రోత్స హిస్తున్నారు. ఒత్తిళు రాజకీయ పైరవీలు అధికారుల సూచనలు కారణంగా వేరే పిల్లలు కూడా చేర్చుకోవాల్సి వస్తుందని ఎస్వోలు వాపోతున్నారుఈ సం వత్సరం ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం ప్రతి క్లాసులో 40 మంది విద్యార్థులను మాత్రమే తీసుకోవాల్సి ఉన్న మెజార్టీ కేజీబీవీలో 60 నుంచి 70 వరకు అడ్మిషన్లు నిర్వహించగా మరో 20 మంది వెయిటింగ్‌లో ఉన్నట్లు కేజీబీవీ పాఠశాలల నిర్వహకులు తెలిపారు.

# క్రూయిజ్ షిప్పులు ప్రారంభం

**విశాఖపట్నం :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. సుందర సాగర నగరం విశాఖపట్నం నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సముద్ర విహార నౌక క్రూయిజ్ షిప్ సేవలు లాంఛ నంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఈ కార్యక్ర మాన్ని ప్రారంభించారు.కేంద్ర మంత్రి సోనోవాల్ ఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో పాల్గొనగా,మంత్రి దుర్గేశ్ విశాఖలో ప్రత్యక్షంగా హాజరై జెండా ఊపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడు తూ... విశాఖపట్నం చరిత్రలో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ఏర్పాటు ఒక మైలురాయిగా నిలిచిపోతుందని అభిప్రాయప డ్డారు. రాష్ట్రంలో పర్యాటక రంగా నికి పూర్వ వైభవం తీసుకువచ్చేం దుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. క్రూయిజ్ టూరిజం ద్వారా విశాఖ ఖ్యాతి మరింత పెరుగుతుందని, పర్యాటకుల రాకతో స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు కూడా పుం జుకుంటాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో క్రూయిజ్ పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తామని మంత్రి దుర్గేశ్ హామీ ఇచ్చారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాకారం చేసిన విశాఖ పోర్టు అథారిటీ అధికారులను, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ నూతన సేవలతో విశాఖ పర్యాటక చిత్ర పటంలో కీలక స్థానం సంపాదించు కుంటుందని మంత్రి పేర్కొన్నారు.

తెలంగాణ లెజెండ్

సంపాదకీయం

శుక్రవారం, జూలై 4, 2025

# అపురూప కళాకారుడు బివి పట్టాభిరామ్

ప్రముఖ ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు బి వి పట్టాభిరామ్ మంగళ వారం గుండె పోటుతో మృతి చెందడంతో ఒక గొప్ప అపూర్వ అపురూప కళాకారుడిని తెలుగు కళామతల్లి కోల్పోయింది. బి.వి. పట్టాభిరామ్ (భావరాజు వేంకట పట్టాభిరామ్) తెలుగు ప్రజలకు సుపరిచితమైన మానసిక విజ్ఞాన ప్రసారకుడు. వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా, హిప్నాటిస్టుగా, రచయితగా, ఇంద్రజాలికుడిగా, ప్రసంగకర్తగా, సమకాలీన మానవ మనస్సు రహస్యాలను అన్వేషించిన అభ్యుదయవేత్తగా భారతదేశం మొత్తంలో పేరుగాంచారు. ఆయన అంతఃప్రయాణం వేలాది మందికి వెలుగునివ్వగా, బాహ్య ప్రపంచంలో అనేక రంగాల్లో తనదైన ముద్ర వేసిన ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రావ్ సాహెబ్ భావరాజు సత్యనారాయణ, లక్ష్మీకాంతమ్మ దంపతులకు పుట్టిన పట్టాభిరామ్ 15 మంది సంతానంలో ఒకరు. బాల్యంలోనే జ్ఞాపకశక్తి, విశ్లేషణా బలంతో గరిష్ట స్థాయికి ఎదిగే వాడని గురువులు గుర్తించారు. కాకినాడలో ఉన్నత విద్య చదువుతూ, ఇంద్రజాల కళపై ఆకర్షితుడయ్యారు. అప్పుడు ప్రముఖ మాంత్రికుడు ఎంబేర్ రావు వద్ద శిక్షణ తీసుకుని మాయాజాలం నేర్చుకున్నారు. విద్యాభ్యాసంలో ఆయన బహుశాఖా ప్రతిభ స్పష్టంగా కనిపించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి సైకాలజీ, ఫిలాసఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీహెచ్‌డీ, ఇతర పలు రంగాల్లో కూడా స్నాతకోత్తర విద్యను అభ్యసించారు. హిప్నోథెరపీ, యోగా, కౌన్సిలింగ్, జర్నలిజం వంటి విభిన్న రంగాల్లో పీహెచ్‌డీలు, డిప్లొమాలను పూర్తి చేసి, అవి అన్ని సమాజ సేవకు వినియోగించారు. పట్టాభిరామ్ తన జీవితం మొత్తాన్ని వ్యక్తిత్వ వికాసానికి అంకితం చేశారు. విద్యార్థులు, యువత, ఉద్యోగార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వంటి అనేక వర్గాలకు ప్రత్యేక శిక్షణా తరగతులు, అవగాహనా సదస్సులను నిర్వహించారు. ఆయన మాటల్లో మంత్రసక్తి ఉంది. “మనస్సుని గెలిచేవాడే జీవితాన్ని గెలవగలడు” అన్న ఆయన సందేశం జనసామాన్యంలో విస్తరించింది. ఆకాశవాణి, దూరదర్శన్, వివిధ టీవీ చానెల్లు, వర్క్‌షాపులు, శిక్షణా శిబిరాల ద్వారా ఆయన సందేశం లక్షల మందికి చేరింది. హిప్నాటిజం పట్ల ఉన్న అపోహలను తొలగించి, దీనిని ఒక మానసిక చికిత్సా పద్ధతిగా ప్రజలకు అందించారు. “సంస్కార హిప్నోథెరపీ” అనే రూపంలో భావోద్వేగ శుద్ధిని సాధించే మార్గాలను పరిచయం చేశారు.

ఆయన హిప్నోథెరపీ ప్రదర్శనలను చూసినవారికి అది మంత్రిక విద్య కాదు, మనోవైద్య విధానమని స్పష్టమైంది.వైద్య రంగంలో కూడా ఆయన సేవలు విశేషం. క్యాన్సర్, ఫోబియా, డిప్రెషన్, నిద్రలేమి వంటి అనేక సమస్యలకు హిప్నోథెరపీ ద్వారా పరిష్కారాలు సూచిస్తూ డాక్టర్లతో కలిసి పనిచేశారు. ఆయుర్వేద, యోగా, మానసిక చికిత్సల సమన్వయంతో ప్రత్యేక మోడల్‌ను అభివృద్ధి చేశారు.రచయితగా ఆయన రచనలు లక్షలాది పాఠకుల జీవితాల్లో మార్పు తీసుకు వచ్చాయి. “విజయం నీ చేతుల్లోనే”, “ఆత్మ విశ్వాసమే ఆయుధం”, “ఆలోచనలే ఆయుధాలు”, “జీవిత వికాస మార్గం”, “మీరు విజేతలు కావచ్చు”, “సమర్థమైన చదువు ఎలా చదవాలి?”, జుఇఖుఎ టమ్ఖుతీ ని ఎలా జయించాలి?” వంటి పుస్తకాలు ప్రత్యేకంగా గుర్తించ దగినవి.

ఈ రచనలు తెలుగుతో పాటు ఇంగ్లీషు, తమిళం, కన్నడ భాషల్లోనూ వెలువడ్డాయి. 1990లలో ఆంధ్రప్రభ సచిత్రవార పత్రికలో “బాలలకు బంగారుబాట” శీర్షికతో బాలల అభ్యుదయానికి రచనలు చేశారు. “బాలజ్యోతి” పత్రికలో “మాయావిజ్ఞానం” పేరిట ఇంద్రజాలంలోని శాస్త్రీయ కోణాన్ని తెలియజేశారు.పట్టాభిరామ్ అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందారు. అమెరికా, ఆస్ట్రేలియా, మలేషియా, సింగపూర్, అరబ్ దేశాల్లో వర్క్‌షాపులు నిర్వహించి భారతీయ సైకాలజీ విజ్ఞానాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. విద్యార్థులకు, టీచర్లకు, మేనేజర్లకు, వైద్యులకు – వర్గం లేకుండా ప్రతి ఒక్కరికి జీవితానుభవాలతో మేళవించిన ఆత్మవిశ్వాసాన్ని అందించారు.సినిమా రంగంలో కూడా ఆయన ఆకస్మికంగా కనిపించినా, నటుడిగా తక్కువ సన్నివేశాల్లో తన అభినయ ప్రతిభను చూపించారు. ఇంద్రజాలికుడిగా, హిప్నాటిస్టుగా, రచయితగా, ప్రసంగకర్తగా, పత్రికా వ్యాసకర్తగా, ఆయన విస్తరణ అర్థం చేసుకోవడానికే సమయం కావాలి. పట్టాభిరామ్ జీవిత భాగస్వామి జయ, తన భర్తతో కలిసి వ్యక్తిత్వ వికాస కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. హైదరాబాద్‌లో గుండెపోటుతో బి.వి. పట్టాభిరామ్ మృతి చెందారు. ఆయన మరణం సైకాలజీ, వ్యక్తిత్వ వికాస రంగాలకు తీరని లోటుగా నిలిచింది. అయినా ఆయన ప్రవేశపెట్టిన భావాల విత్తనాలు మనసుల్లో మొలకెత్తుతూనే ఉన్నాయి. బి.వి. పట్టాభిరామ్ పేరు మానవ మానసిక వికాస చరిత్రలో చిరస్థాయిగా నిలవనిది. మన జీవితాల్లో ఒత్తిడి, అనిశ్చితి, గందరగోళం మధ్య ఆలోచనలే ఆయుధాలు అన్న ఆయన పాఠం జీవన మార్గదర్శకంగా నిలుస్తుంది. తన వ్యక్తిత్వంలో జ్ఞానాన్ని, హాస్యాన్ని, శాంతాన్ని మేళవించిన ఈ మేధావి పేరు, పుస్తకాలు, ప్రసంగాలు – తరతరాల పాఠశాలలపై తన ప్రభావాన్ని కొనసాగిస్తూనే ఉంటాయి.

# విలక్షణ నటుడు ఎస్వీ రంగారావు



తెలుగు సినీ చరిత్రలో ఒక ప్రత్యేక విలక్షణ నటులు ఎస్వీ రంగారావు. రంగారావు తన నటనలో ఆంగిక, వాచిక, ఆహార్య, సాత్వికా భినయాలు కలబోసిన నటుడు. సహజ నటుడిగా పేరు గాంచారు. పౌరాణిక, సాంఘిక, చారిత్రిక, ఐతిహాసిక పాత్రలు ఏవైనా వాటిల్లో పరకాయ ప్రవేశం చేసి, అందరి మన్ననలు పొందిన మహానటులు యస్వీఆర్. నవరసాలను అలవోకగా అవలీలగా పాత్రల ద్వారా ఒలికించిగల అతికొద్ది మంది నటుల్లో ఎస్వీఆర్ ది అగ్రస్థానం. ఎస్వీ రంగారావు కృష్ణా జిల్లా లోని నూజివీడులో, 1918 జూలై 3 వ తేదీన జన్మించారు. మద్రాసు హిందూ హైస్కూలులో తన పదిహేనవ ఏట మొదటి సారిగా నాటకంలో నటించారు. తన నటనకు అందరి నుంచి ప్రశంసలు రావడంతో ఆయనలో నటుడు కావాలన్న కోరికకు బీజం పడింది. తర్వాత పాఠశాలలో ఏ నాటకం వేసినా ఏదో ఒక పాత్రలో నటించేవారు. వక్తృత్వ పోటీల్లో పాల్గొనేవారు. క్రికెట్, వాలీబాల్, టెన్నిస్ క్రీడల్లోనూ ప్రవేశం ఉండేది. 1936 లో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్తు ఉత్సవాలలో రంగారావు బళ్ళారి రాఘవ, గోవిందరాజు సుబ్బారావు లాంటి ప్రఖ్యాత నటులను చూసి తాను కూడా ఎలాగైనా నటుడు అవ్వాలనుకున్నారు. మద్రాసులో ఎక్కడ తెలుగు నాటకాలు జరుగుతున్నా హాజరయ్యేవారు. అన్ని భాషల సినిమాలు శ్రద్ధగా చూసేవారు. వాటిని విశ్లేషించేవారు. ఇంటర్ పరీక్షకు 45 మంది హాజరయితే అందులో రంగారావు ఒక్కడే ఉత్తీర్ణుడు కావడం విశేషం. రంగారావు కు మాత్రం నటుడు కావాలనే కోరిక బలంగా ఉండేది. బాగా చదువుకుంటూనే నటనను కూడా వదిలి పెట్టలేదు. కాకినాడ లోని యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ లో చేరి ఎన్నో నాటకాల్లో పాల్గొన్నారు. ఆయనకు ఇక్కడ అంజలీదేవి, ఆదినారాయణ రావు, బి.ఎ.సుబ్బారావు, రేలంగి వంటి వారితో పరిచయం ఏర్పడింది. నాటకాల్లో రంగారావు అనేక వైవిధ్యమైన పాత్రలు పోషించారు. పీష్వా నారాయణరావు వధ నాటకంలో రంగారావు ఇరవై రెండేళ్ళ వయసులో అరవై ఏళ్ళ వృద్ధుని పాత్ర ధరించి మెప్పించారు. ఖిల్జీ రాజ్యపతననం నాటకంలో మాలిక్ కపూర్ పాత్రలో, స్ట్రీట్ సింగర్ నాటకంలో విలన్ పాత్ర మొదలైన పాత్రలు పోషించారు. రంగారావు కు ఇంగ్లీషు మీద కూడా పట్టు ఉండటంతో షేక్స్‌పియర్ నాటకాల్లోని సీజర్, ఆంటోనీ, షైలాక్ లాంటి పాత్రలు పోషించేవారు. నాటకాలు వేస్తూనే బి. ఎస్. సి పూర్తి చేశారు. మొదట బందరు లో తర్వాత విజయ నగరంలో ఫైర్ ఆఫీసరు గా పనిచేశారు. ఈ ఉద్యోగంలో రంగారావుకు పెద్దగా పని ఉండేది కాదు. కానీ ఉద్యోగ స్వభావ రీత్యా ఖాళీ సమయాల్లో నటించడానికి వీలులేదు. తాను కళకు దూరం అవుతున్నేనేమో నని భావించిన రంగారావు ఆ ఉద్యోగం నుంచి బయటకు వచ్చేశారు. ఆయన నటించిన మొట్టమొదటి చిత్రం 1946లో వచ్చిన వరూధిని అనే చిత్రం. తొలి సినిమాలో పాత్ర పోషించినందుకు గాను రూ.750 పారితోషికంగా అందుకున్నారు. ఎల్. వి. ప్రసాద్ దర్శకత్వంలో వచ్చిన మనదేశం, పి. పుల్లయ్య దర్శకత్వంలో వచ్చిన తిరుగుబాటు చిత్రంలో కూడా అంతగా ప్రాధాన్యం లేని పాత్రలే వచ్చాయి. అయినా రంగారావు నిరుత్సాహ పడకుండా మంచి అవకాశం కోసం ఎదురుచూడ సాగారు. నాగిరెడ్డి, చక్రపాణి కలిసి విజయా ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ తొలిసారిగా నిర్మించిన షావుకారు సినిమాలో సున్నపు రంగడు అనే కీలకమైన పాత్రను రంగారావు కిచ్చారు. ఈ సంస్థలో ప్రవేశించడం రంగారావు కెరీర్ కు గట్టి పునాది పడింది. తర్వాత అదే సంస్థ నిర్మించిన పాతాళ భైరవి (1951) సినిమాలో అతి ముఖ్యమైన మాంత్రికుడి పాత్రను రంగారావు కిచ్చారు. పరభాషా సినిమాలు కూడా ఎన్నో పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టాయి. హిందీ భాషలో ప్రవేశమున్న రంగారావు తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకున్నారు. భానుమతి దర్శక నిర్మాత వచ్చిన నాది ఆడజన్మే ఆధారంగా హిందీలో తీసిన మై భీ లడ్కీ హూ లాంటి హిందీ చిత్రాల్లో నటించారు. భూకైలాస్, మాయాబజార్ లాంటి కన్నడ చిత్రాలలోనూ, విదయాగలే ఎతిలే ఎతిలే, కవిత వంటి మలయాళ చిత్రాలలో కూడా నటించారు.నటసామ్రాట్, విశ్వనట చక్రవర్తి మొదలగు బిరుదులతో తెలుగు ప్రేక్షకులు ఆయన్ను గౌరవించారు. ఎస్వీయార్ నటించిన నర్తనశాల ఇండొనేషియా లోని జకార్తాలో ఆఫ్రో–ఆసియా అంతర్జాతీయ చిత్రోత్సవము?లో ప్రదర్శించ బడడమే కాకుండా కీచకపాత్రకు గాను ఎస్వీయార్ అప్పటి ఎన్నో చిత్రాల కథా నాయకులను వెనుకకు నెట్టి భారతదేశం నుంచి తొలి అంతర్జాతీయ ఉత్తమ నటుడుగా బహుమతి పొందారు. కొన్ని చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. ముఖ్యంగా ఆయన దర్శకత్వం వహించిన చదరంగం చిత్రానికి రెండో ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం లభించింది. రెండో చిత్రం బాంధవ్యాలు ఉత్తమ చిత్రంగా నంది పురస్కారం అందుకున్నది. మొదటి సినిమా వైఫల్యం తర్వాత రంగారావు జంషెడ్పూర్ లో టాటా కంపెనీలో ఉద్యోగం లో చేరారు. ఇదే సమయంలో ఆయన మేనమామ బడేటి వెంకట రామయ్య, కోటేశ్వరమ్మ దంపతుల కుమార్తె లీలావతిని 1947 డిసెంబరు 27న వివాహం చేసుకున్నారు. వ్యక్తిగా రంగారావు చమత్కారి, సహృదయుడు. సినిమా సెట్స్ మీద గంభీరంగా ఉండేవారు. వ్యక్తిగత విషయాలు సహనటులతో చర్చించడానికి ఇష్టపడేవారు కాదు.ఆయన ఇష్టదైవం శివుడు. ప్రతిరోజూ శివపూజ చేసిన తర్వాత దినచర్య ప్రారంభించేవారు. యస్వీఆర్ ఒక వేదాంతి. ఆయన ఇంటి లైబ్రరీలో వివేకానందునికి సంబంధించిన పుస్తకాలు ఎన్నో ఉండేవి. తానే స్వయంగా కొన్ని రచనలు కూడా చేశారు. ప్రజాహిత సంస్థలకు లెక్కలేనన్ని విరాళాలు ఇచ్చారు. చైనాతో యుద్ధం వచ్చినపుడు ఏర్పాటు చేసిన సభలో పదివేల రూపాయలు విరాళం ఇచ్చారు. తర్వాత పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చినపుడు కూడా ఎన్నో సభలు నిర్వహించి, మిగతా నటులతో కలసి ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి, విరాళాలు సేకరించి, ఆ డబ్బును రక్షణ నిధికి ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ లో ఏలూరు, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, పాలకొల్లు, సామర్లకోట, పెనుగొండ, అనకాపల్లి లాంటి ఊర్లలో ఆయనకు సన్మానాలు జరిగాయి. జకార్తాలో పురస్కారం అందుకుని మద్రాసు వచ్చాక మద్రాసు సోషల్ అండ్ కల్చరల్ క్లబ్ , ఆంధ్రా ఫిల్మ్ జర్నలిస్టు సంఘం , దక్షిణ భారత ఫిల్మ్ వాణిజ్య మండలి, మద్రాసు సినిమా ప్రేక్షక సంఘాలు ఘనంగా సన్మానించారు. అన్నై, శారద, నానుం ఒరు పెణ్, కర్పగం, నర్తనశాల సినిమాలకు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా పారితోషికం స్వీకరించారు. విశ్వనటచక్రవర్తి, నటసార్వభౌమ, నటసింహ, నటశేఖర తదితర బిరుదులు పొందారు. రంగారావు దర్శకత్వం వహించిన మొదటి చిత్రం చదరంగం ద్వితీయ ఉత్తమ చిత్రంగా నంది అవార్డును, రెండవ చిత్రం బాంధవ్యాలు తొలి ఉత్తమ చిత్రంగా నంది అవార్డును గెలుచుకున్నాయి. నర్తనశాల చిత్రంలో నటనకు ఇండోనేషియా ఫిలిం ఫెస్టివల్లో ఉత్తమ నటుడి అవార్డు, అదే పాత్రకు రాష్ట్రపతి అవార్డు అందుకున్నాడు. 2013 లో భారత సినీ పరిశ్రమ వందేళ్ళ సందర్భంగా విడుదలయిన తపాళాబిళ్ళలలో ఒకటి ఎస్వీ రంగారావు మీద విడుదలయింది.రంగారావుకు తొలినాళ్ళలో మంచి పేరు తెచ్చిన షావుకారు చిత్రంలోని సున్నం రంగడి పాత్ర కోసం తన స్వగ్రామంలో కోడి రంగడు అనే రౌడీని మనసులో పెట్టుకుని అతని మాట తీరుని, ప్రవర్తనా విధానాన్ని అనుకరించారు. సంతానం చిత్రంలో ఆయన పోషించిన గుడ్డివాని పాత్ర కోసం కొన్నాళ్ళు పాటు అంధుల ప్రవర్తనను గమనించారు. మాంత్రికుడి పాత్ర కూడా తాను ఆంగ్ల నాటకాల్లో ధరించిన షైలాక్ పాత్రలను ఆధారంగా చేసుకుని మరింత రౌద్రరసాన్ని కలిపి తనదైన శైలిలో నటించారు. రంగారావు యుముడి పాత్ర పోషించిన సతీ సావిత్రి సినిమా మద్రాసులో జెమినీ స్టూడియోలో చిత్రీకరణ జరుగుతుండగా మద్రాసు పర్యటనకు వచ్చిన చైనా ప్రధాని చౌ ఎన్ లై ఈయన నటనను అభినందించారు. జులై 3, 2018న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఏలూరులో పన్నెండున్నర అడుగుల ఎత్తైన రంగారావు కంచు విగ్రహాన్ని ఆవిష్కరించారు. 1974 జూలై 18వ తేదీన మద్రాసులో కన్ను మూశారు.

# ప్రాణాంతకంగా మారుతున్న ప్లాస్టిక్ బ్యాగుల వ్యర్థాలు

నేడు ప్రపంచమంత ప్లాస్టిక్‌మయం అయ్యింది. ప్లాస్టిక్ కనబడని గృహం లేదు, వాడని మనిషి లేడు. ఎక్కడ చూసినా ఏమున్నదా గర్వకారణం, సర్వం గరళ ప్లాస్టిక్ బ్యాగుల బూతమే. వాడడానికి సౌకర్యంగా, మన్నిక కలిగిన గుణాలు ప్లాస్టిక్స్ స్వంతం. చెవులను శుభ్రం చేసుకునే ఇయర్ బడ్ నుంచి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, పాలు/ నూనె/ ద్రవాల ప్యాకెట్లు, వాటర్ పాటిల్స్, పానీయాలు తాగే స్ట్రాలు, వంటింటి సరుకులు నిల్వ చేసే డబ్బాలు, కుర్చీలు, పలు రకాల పర్నీచర్లు, పిల్లల ఆట బొమ్మల వరకు ఎక్కడ చూసినా, ఏ దుకాణానికి వెళ్లినా సర్వం ప్లాస్టిక్ వస్తువులు లేదా ప్యాకేజ్‌లు కనిపిస్తున్నాయి. నాడు కర్రకు ప్రత్యామ్నాయంగా, వరప్రసాదంగా 1930ల్లో కనుగొనబడి, 1970–1980లో వాడకం మొదలైన ప్లాస్టిక్ ఉత్పత్తులు నేడు సముద్ర జలాలు, సాగు నేలలను సహితం విషతుల్యం చేసే దుస్థితి వరకు ప్లాస్టిక్ బూతం చేరింది. వాడి పడేసిన ప్లాస్టిక్ ఉత్పత్తులు జీవ విచ్ఛిన్నం కావడానికి 100 నుంచి 1000 ఏండ్లు పడుతున్నది. రసాయనశాస్త్ర పరంగా చిన్న చిన్న అణువు అనేకం రసాయన చర్యల ద్వారా కలిసి అతి పెద్ద శృంఖలాలు ఏర్పడి, ప్లాస్టిక్ బృహదణువులుగా లేదా పాలిమర్స్‌గా పిలువబడతాయి. పాలిథీన్ కవర్స్, పివిసి పైప్స్ లాంటి ప్రధాన ప్లాస్టిక్ ఉత్పత్తుల గూర్చి మనకు తెలుసు. ఒకనాడు షాపుల్లో పర్యావరణహిత పేపర్ ప్యాకింగ్ చేసే అలవాటు ఉండేది. మనం ఏ వస్తువును కొన్నా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోనే ఇంటికి తెచ్చుకుంటాం. ప్రపంచవ్యాప్తంగా సాలీనా 5 ట్రిలియన్ల ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేయబడడం, నిమిషానికి 1 మిలియన్ బ్యాగులు వాడడం, ప్రతి మనిషి సగటున 25 నిమిషాలకు ఒక ప్లాస్టిక్ బ్యాగు వాడడం జరుగుతున్నది. విచ్ఛలవిడిగా, విచక్షణారహితంగా వాడుతున్న ప్లాస్టిక్ బ్యాగుల పర్యావరణానికి అత్యంత ప్రమాదకరమని మేల్కొనవలసిన సమయం ఆసన్నమైంది. ప్లాస్టిక్ బ్యాగుల వినియోగంతో దాదాపు ఒక లక్ష సముద్ర జంతువుల మనుగడ ప్రశ్నార్థకం అయ్యింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రమాదకర ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం పట్ల అవగాహన కల్పించడానికి, వాటి దుష్ప్రభావాలను వివరించడానికి ప్రతి ఏట 03 జూలై రోజున “అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం” పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం వేదికగా ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం, వాటి విష ప్రభావాలను వివరించడం, వాటికి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వెతకడం, పర్యావరణ పరిరక్షణకు కంకనబద్దులు కావడం లాంటి అంశాలను అవగాహన పరుస్తారు. మన ఇంట్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించుకోవడం, ప్లాస్టిక్ కవర్స్‌కు బదులుగా పేపర్ లేదా క్లాత్ బ్యాగులు వాడడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించడం, తప్పనిసరి అయినపుడు ఒక్క ప్లాస్టిక్ బ్యాగును తిరిగి పలు మార్లు వాడడం, ప్లాస్టిక్ బ్యాగులు లేని మార్కెటింగ్ రోజులను తిరిగి పొందడం, సహజ ఉత్పత్తులతో బ్యాగులను తయారు చేసుకొని వాడడం లాంటి చర్యలకు పూనుకోవలసిన సమయం ఆసన్నమైంది.

# రాంచందర్ రావు చేతుల్లో బీజేపీ భవితవ్యం



తెలంగాణ బీజేపీకి కొత్త ఆశగా నిలిచిన పేరు – ఎన్. రాంచందర్ రావు. ఆలోచనలతో నడిచే ఈ న్యాయవాది నాయకుడు, ఉద్యమ కాలం నుంచి పార్టీకి అంకితంగా పనిచేస్తూ స్వచ్ఛత, మితభాష, సుశీల రాజకీయాల ప్రాతినిధ్యంగా ఎదిగిన వ్యక్తిత్వం. తెలంగాణ రాష్ట్రంలోని బీజేపీ రాజకీయాల్లో ఆయా కాలాల్లో వచ్చిన ఒడిదుడుకులను పక్కదారి మళ్ళించి, పార్టీకి గౌరవాన్ని, నాయకత్వాన్ని, సామర్థ్యాన్ని కలిగించే బాధ్యత ప్రస్తుతం ఆయన భుజాలపై ఉంది. రాంచందర్ రావు రాజకీయ జీవితానికి మూలం న్యాయవాదిగా ఉన్న సుదీర్ఘ అనుభవమే. హైకోర్టు అడ్వకేట్‌గా తన వృత్తిలో ప్రశంసలు అందుకుంటూనే, ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. బహుళ విభాగాల సమస్యలపై లోతుగా అవగాహన ఉన్న ఆయనకు ప్రజల సమస్యలపై స్పందించే తీరు ప్రత్యేకత. ఓనాటి ఉద్యమం లోనే కాదు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో సభ్యుడిగా ఉన్నపుడూ బలమైన వాదనలతో ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆయన వాక్చాతుర్యంతో, సూత్రబద్ధమైన నడవడికతో బీజేపీ గొప్ప ప్రతినిధిగా నిలిచారు. రాంచందర్ రావులోని ప్రధాన బలమేది అంటే – అంతర్గత కలహాలను ప్రశాంతంగా ఎదుర్కొని, వర్గ పోరాటాలను దరి చేరకుండా వహరించగల నైపుణ్యం. ఆయనకు పార్టీలో అనేక వర్గాల్లోనూ మంచి సంబంధాలు ఉన్నాయి. క్రమశిక్షణ, కార్యకర్తల పట్ల గౌరవం, భావోద్వేగాలకు లొంగకుండా వ్యవహరించగల నిబద్ధత వంటి లక్షణాలు ఆయన నాయకత్వాన్ని ప్రత్యేకంగా నిలబెడు తున్నాయి. పార్టీలోకి వచ్చిన నూతన నేతలతో పాటు పాత క్యాడర్‌ను సమన్వయపరిచే లోక నాయకత్వ ధోరణి ఆయనది. ఒక్కసారిగా ఉత్తరాధికారాన్ని సొంతం చేసుకోవాలన్న ఆతురత ఆయనలో కనిపించదు. బదులుగా, నిశ్చింతగా, నిర్లక్ష్యంగా కాకుండా సమగ్ర వ్యూహంతో పార్టీని ముందుకు నడిపించే శక్తి ఆయనకు ఉంది. కార్యకర్తల మూడ్, వర్గీయ పరస్పర అభిప్రాయ భేదాల నేపథ్యంలో కలుపుగోరుగా వ్యవహరించే నేతగా ఆయనపై అంతర్గతంగా విశ్వాసం పెరుగుతోంది. రాంచందర్ రావు బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లగల నాయకుడు. ఆయన మాటల్లో ప్రత్యేక ధ్వని, ప్రజల పట్ల గౌరవ భావం, అధిపత్య భావన లేకుండా వ్యవహరించే మానవతా శైలి – ఇవన్నీ సమకాలీన రాజకీయాల్లో అరుదైన విలువలు. ఆయన వ్యక్తిత్వంలో రాజకీయ ప్రతిభతో పాటు సాంస్కృతిక అభిరుచి, సామాజిక స్పృహ, చట్టాలపై లోతైన అవగాహన కనిపిస్తుంది.తెలంగాణ బీజేపీకి ప్రస్తుతం ఉన్న అనేక సమస్యలు – వర్గీయ పోరు, అసంతృప్తులు, కమ్యూనికేషన్ లోపం, ప్రజల్లో నమ్మక బలహీనత వంటి వాటిని అధిగమించాలంటే ఒక మిశ్రమ నేత అవసరం. బహుళ విభాగాలపై పట్టు ఉన్నవాడు కావాలి. ప్రజల్లో విశ్వసనీయత కలిగినవాడు కావాలి. పార్టీ కార్యచరణను నిర్వాహకంగా పటిష్టంగా మలచ గలవాడు కావాలి. ఆ మూడింటి కలయిక రాంచందర్ రావులో ఉంది.ఆయన పార్టీకి పరిమితమైన నేత మాత్రమే కాదు.

నైతిక విలువలతో కూడిన ప్రజా ప్రతినిధిగా, కార్యకర్తలకు మార్గదర్శిగా, సమర్థ శక్తిగా మారగల నాయక శక్తి ఆయనలో స్పష్టంగా కనిపిస్తుంది. రాజకీయ లబ్దులకోసం కాదు, పార్టీ పునర్నిర్మాణం కోసం ఆత్మార్పణ పూరితంగా పనిచేయగల తీరు ఆయనకి ప్రత్యేకమైన స్థానం కల్పిస్తుంది. ఈ సమయంలో బీజేపీకి కావాల్సినది రాద్ధాంత శబ్దాలు చేసే నేతలు కాదు. శబ్దాన్ని కార్యాచరణగా మార్చగల సుదీర్ఘ దృక్కోణం కలిగిన నాయకత్వం. అలాంటి నాయకుడే రాంచందర్ రావు. రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీకి తిరిగి ప్రతిష్ఠను తీసుకు రావాలంటే, ఆయన వంటి నాయకుల నైతిక బలమే దారి దీపం కావాలి. రాష్ట్రీయ రాజకీయాలు తిరుగుబాటులో ఉన్న ఈ వేళ, రాంచందర్ రావు నాయకత్వంలో బీజేపీ తన లోతును గుర్తించుకుని మళ్లీ సమర్థ రాజకీయ శక్తిగా మారే అవకాశం ఉంది.

# గుండె జబ్బులను దూరం చేసే శక్తివంతమైన ఆహారాలు...!



గుండె ఆరోగ్యం కోసం చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడం అత్యంత ముఖ్యం. దీని కోసం ఆరోగ్యకరమైన ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. రోజువారీ జీవనశైలిలో ఓట్స్, నట్స్, చేపలు లాంటి పదార్థాలను చేర్చితే చెడు కొలెస్ట్రాల్ ను సహజంగా నియంత్రించవచ్చు. మన శరీరంలో కొలెస్ట్రాల్ సహజంగానే ఉంటుంది. ఇది రెండు రకాలు. ఒకటి మంచిది, ఇంకొకటి చెడుది. ఈ చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నప్పుడు గుండె జబ్బులు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. ఇది ఎక్కువైతే అది రక్తనాళాల్లో పేరుకుపోయి రక్త ప్రసరణను అడ్డుకుంటుంది. దీని వల్ల హార్ట్ ఎటాక్, స్ట్రోక్ లాంటి తీవ్ర సమస్యలు రావొచ్చు. కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో సహాయపడే కొన్ని ఆహారాలను మన రోజువారీ జీవితంలో చేర్చుకుంటే.. ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. వాటిలో ముఖ్యమైన మూడు ఆహార పదార్థాలు ఉన్నాయి. వాటి గురించి ఇప్పుడు మనం వివరంగా తెలుసుకుందాం.

ఓట్స్: ప్రతిరోజూ ఓట్స్ ఉదయాన్నే లేదా రాత్రి తినడం ద్వారా మనం చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించుకోవచ్చు. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణ సమస్యలు తగ్గుతాయి. ఈ ఫైబర్ ఇది స్థాయిని తగ్గించే విధంగా పనిచేస్తుంది. కొన్ని పరిశోధనల ప్రకారం.. ఓట్స్ లో ఉండే పోషకాలు శరీరంలోని విషాలను తొలగించడంలో సహాయపడతాయి. ఇందులో ఐరన్, విటమిన్ దీ, విటమిన్ జు, జింక్, సెలీనియం లాంటి ముఖ్యమైన మినరల్స్ కూడా ఉంటాయి.

ఇవి శరీర శక్తిని పెంచుతాయి. తెలివితేటలను మెరుగుపరుస్తాయి.

నట్స్: బాదం, పిస్తా, వేరుశనగలు లాంటి నట్స్ లో ఆరోగ్యానికి ఉపయోగపడే మంచి కొవ్వులు ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంలో చాలా సహాయపడతాయి. రోజుకు గుప్పెడు నట్స్ తినడం వల్ల గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం మాత్రమే కాకుండా.. శరీరంలో వచ్చే ఆక్సీకరణ ప్రభావాన్ని తగ్గించి క్యాన్సర్ లాంటి వ్యాధుల నుంచి కూడా రక్షణ పొందొచ్చు. వీటిలో విటమిన్ జు, సెలీనియం లాంటి యాంటీఆక్సిడెంట్లు ఉండటం వల్ల శరీరంలో మలినాలను బయటకు తీసివేసే శక్తి కలుగుతుంది.

చేపలు: రుచిగా ఉండే చేపల్లో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండె సంబంధిత వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి. చేపలు తినడం వల్ల శరీరంలోని వాపు తగ్గుతుంది. రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. ప్రోటీన్లు ఎక్కువగా ఉండటం వల్ల ఆకలిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఎక్కువ కేలరీలతో ఉండే ఫాస్ట్ ఫుడ్ తినే అవకాశాన్ని తగ్గిస్తాయి. ముఖ్యంగా ఫ్యాటీ లివర్, ఎసిడిటీ లాంటి సమస్యలు ఉన్నవారికి చేపలు ఆహారంలో చేర్చడం మంచిది. రోజువారీ ఆహారంలో ఓట్స్, నట్స్, చేపలు లాంటి పదార్థాలను చేర్చడం వల్ల చెడు కొలెస్ట్రాల్ ను సహజంగా తగ్గించుకోవచ్చు. ఇవి గుండె సంబంధిత సమస్యలు రాకుండా అడ్డుకోవడంలో సహాయపడతాయి. అంతేకాదు శరీరంలో వ్యర్థాలను తొలగించడంలో, శక్తిని మెరుగుపరచడంలో, జీర్ణాన్ని బలోపేతం చేయడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. సరైన జీవనశైలి, తగిన వ్యాయామం, సరిపడా నిద్రను పాటిస్తూ ఈ ఆహారాలు తీసుకుంటే మీరు ఆరోగ్యంగా ఉండగలుగుతారు.

# జీర్ణసమస్యలకు కారణమయ్యే ఆహారాలు...



ఓ వయసు పైబడిన తర్వాత చాలా మందిని వేధించే సమస్యల్లో జీర్ణాశయ సమస్యలు, కీళ్ల నొప్పులు వంటివి ప్రధానంగా ఉంటాయి. వీటన్నింటికి శరీరంలో వాత దోషం పెరగడమే కారణం. వాత దోషం పెరగడానికి ప్రధాన కారణాల్లో ఆహారం ఒకటి. కొన్ని రకాల ఆహార పదార్థాలు వాతాన్ని ప్రేరేపించి కీళ్ల నొప్పులు, కండరాల పట్టేయడం, జీర్ణ సమస్యలు వంటి లక్షణాలను కలిగిస్తాయి. వాతాన్ని తగ్గించుకోవాలంటే ఆహార నియమాలు పాటించడం చాలా ముఖ్యం. వాతం, వాతపు నొప్పులు ప్రస్తుత జీవనశైలిలో చాలా మందిని వేధిస్తున్న సమస్య. శరీరంలో వాత దోషం పెరిగినప్పుడు కీళ్ల నొప్పులు, కండరాల పట్టేయడం, పొడి చర్మం, మలబద్ధకం, నిద్రలేమి వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ వాత దోషం పెరగడానికి మనం తీసుకునే ఆహారం ప్రధాన కారణం. కొన్ని ఆహార పదార్థాలు వాతాన్ని పెంచి, నొప్పులను తీవ్రతరం చేస్తాయి. వాతాన్ని పెంచే ముఖ్యమైన ఆహార పదార్థాలలో ఒకటి శీతల పానీయాలు, చల్లని ఆహారాలు. రిఫ్రిజిరేటర్లో ఉంచిన ఆహారాలు, పానీయాలు వాతాన్ని తీవ్రం చేస్తాయి. అలాగే, ఎక్కువగా డ్రై ఫ్రూట్స్, పొడి ఆహారాలు తీసుకోవడం కూడా వాతాన్ని పెంచుతుంది. పప్పుధాన్యాలలో కొన్ని రకాలు, ముఖ్యంగా శనగలు, రాజ్మా, అల్లం, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బంగాళదుంపలు, వంకాయ, అరటిపండ్లు వంటివి వాతాన్ని పెంచుతాయి. వీటిని మితంగా తీసుకోవడం మంచిది.వేయించిన ఆహారాలు, జంక్ ఫుడ్, పులిసిన ఆహారాలు వాతాన్ని పెంచే మరో ముఖ్యమైన వర్గం. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పట్టి, శరీరంలో వాతాన్ని పెంచుతాయి. అతిగా చేదు, వగరు రుచి గల పదార్థాలు కూడా వాతాన్ని పెంచుతాయి. ఉదాహరణకు, చేదు కూరలు, సలాడ్లు అతిగా తినడం మంచిది కాదు. వాతాన్ని తగ్గించుకోవాలంటే, వేడి, తేలికగా జీర్ణమయ్యే ఆహారాలు తీసుకోవాలి. ఉదాహరణకు, నెయ్యి, నూనెతో కూడిన ఆహారాలు, వండిన కూరగాయలు, గోరువెచ్చని నీరు వాతాన్ని తగ్గిస్తాయి. పాత అన్నం, పప్పులు, బార్లీ, గోధుమ వంటి వాటికి బదులుగా కొత్త ధాన్యాలు, బియ్యం తీసుకోవడం మంచిది. ఆహార నియమాలతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం, తగినంత నిద్ర, ఒత్తిడి తగ్గించుకోవడం వంటివి వాతాన్ని అదుపులో ఉంచడానికి సహాయపడతాయి. ఏదైనా దీర్ఘకాలిక నొప్పి లేదా సమస్య ఉంటే వైద్య నిపుణుడిని సంప్రదించడం ఉత్తమం

# గర్భధారణలో థైరాయిడ్ ప్రభావం..



థైరాయిడ్ గ్రంథి చిన్నదైనా.. దాని ప్రభావం శరీరవ్యాప్తంగా ఉంటుంది. జీవక్రియ, శక్తి వినియోగం, శరీర ఉష్ణోగ్రత వంటి ముఖ్యమైన వ్యవస్థలను నియంత్రిస్తుంది. ఈ గ్రంథి సరిగా పనిచేయకపోతే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అవి గుర్తించి ముందస్తు గా జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. శరీరంలో ఎన్ని ముఖ్యమైన గ్రంథులున్నా.. మెడ భాగంలో ఉండే చిన్నదైన థైరాయిడ్ గ్రంథి అనేక శారీరక వ్యవస్థల పనితీరును ప్రభావితం చేస్తుంది. ఇది తగినంత హార్మోన్లను విడుదల చేయడం ద్వారా శరీరంలో జీవక్రియ, శక్తి వినియోగం, శరీర ఉష్ణోగ్రత వంటి అనేక పనులను నియంత్రిస్తుంది. ఈ గ్రంథి సరిగా పనిచేయకపోతే రెండు రకాల సమస్యలు ఎదురవుతాయి.. హైపర్ థైరాయిడిజం (హార్మోన్ల అధిక ఉత్పత్తి) హైపో థైరాయిడిజం (హార్మోన్ల లోపం). రెండు పరిస్థితులూ శరీరాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. థైరాయిడ్ హార్మోన్లు ఎక్కువగా ఉత్పత్తి అయ్యే స్థితిని హైపర్ థైరాయిడిజం అంటారు. ఈ పరిస్థితిలో సాధారణంగా కనిపించే సూచనలు. అకస్మాత్తుగా బరువు తగ్గడం, ఆకలి మరింత పెరగడం, అధిక రక్తపోటు, వేడి తట్టుకోలేకపోవడం, తరచూ మూత్రవిసర్జన కావడం, మహిళల్లో ముఖ్యంగా ఋతుస్రావం అసమాన్యతలు, జుట్టు ఎక్కువగా రాలిపోవడం, గర్భధారణలో ఇబ్బందులు కనిపించవచ్చు. డాక్టర్లు చెబుతున్నదేమిటంటే.. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవడం మంచిది.

# పచ్చి ఉల్లిపాయలు తింటే ఏమౌతుందో తెలుసా..?



చాలామంది పచ్చి ఉల్లిపాయలను తినేందుకు ఎంతగానో ఇష్టపడతారు. ముఖ్యంగా మాంసాహారంతో తయారు చేసిన కొన్ని రకాల ఆహారాలు తినే క్రమంలో తప్పకుండా వచ్చి ఉల్లిపాయలు తింటూ ఉంటారు. పెరుగుతో చేసిన రైతాలో ఎక్కువగా పచ్చి ఉల్లిపాయలను వేసుకొని కూడా తింటుంటారు. ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదు అని మన పెద్దలు కూడా తరచూ చెబుతూ ఉంటారు. కానీ, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు ఇలా పచ్చి ఉల్లిపాయ తినటం మంచిదేనా..? నిజానికి పచ్చి ఉల్లిపాయలు గుండె సమస్యలు ఉన్నవారు తప్పకుండా తినాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. పచ్చి ఉల్లిపాయలు గుండె సమస్యలు ఉన్నవారు 40 రోజుల పాటు తినడం వల్ల అద్భుతమైన లాభాలు పొందుతారు. ఉల్లిపాయలోని సల్ఫర్ రక్తపోటును, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ఫలితంగా గుండె జబ్బులు, హార్ట్ స్ట్రోక్ వంటివి దరి చేరకుండా ఉంటాయి. ముఖ్యంగా పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల అందులో లభించే క్వెర్సెటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని కొవ్వును సులభంగా కరిగిస్తుందని చెబుతున్నారు. ముఖ్యంగా గుండె సమస్యలు ఉన్నవారు అలాగే చెడు కొలెస్ట్రాల్ తో బాధపడుతున్న వారు తప్పకుండా పచ్చి ఉల్లిపాయలను ఆహారంలో భాగంగా తీసుకోండి. కొంతమందిలో మంచి ఉల్లిపాయలు తింటే అందులో లభించి సల్ఫర్ సమ్మేళనాలు రక్తపోటును నియంత్రించేందుకు కూడా క్రియాశీలక పాత్ర పోషిస్తాయి.

పచ్చి ఉల్లిపాయల్లో పుష్కలంగా సల్ఫర్ ఉంటుంది.. కాబట్టి రక్తపోటును నియంత్రించి గుండెను శక్తివంతంగా తయారు చేస్తుంది. ఉల్లిపాయల్లో ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచే లక్షణాలు ఉంటాయి. కాబట్టి మధుమేహంతో బాధపడుతున్న వారు, ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారు, రోజూ పచ్చి ఉల్లిపాయను తింటే ఆ సమస్య నుంచి బయటపడతారు. ఉల్లిపాయలు ఎముకల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిలో కాల్షియం అధికంగా ఉంటుంది. సల్ఫర్, క్వెర్సెటిన్ వంటి సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఆర్థరైటిస్ వంటి సమస్యలు రాకుండా అడ్డుకుంటాయి.

# మిరియాలతో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు..!



నల్ల మిరియాలు కేవలం రుచి కోసం మాత్రమే కాకుండా ఆరోగ్యానికి సహజ ఔషధంగా పని చేస్తాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగుపరచడం నుంచి మానసిక ప్రశాంతత వరకూ ఎన్నో ప్రయోజనాలు కలిగిస్తాయి. ప్రతిరోజూ మన ఆహారంలో నల్ల మిరియాలను చేర్చితే ఆరోగ్యంపై మంచి ప్రభావం పడుతుంది. నల్ల మిరియాలు ఆహారానికి రుచిని మాత్రమే కాదు.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇది కేవలం మసాలా దినుసు కాదు.. మన శరీరానికి అవసరమైన ఒక సహజ ఔషధం. నల్ల మిరియాల్లో ఒక ప్రత్యేక గుణం ఉంది. ఇది మన శరీరంలో జీర్ణరసాలు ఎక్కువ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల మనం తిన్న ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. గ్యాస్, అజీర్తి, పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. ఆహారం శరీరానికి బాగా పడుతుంది. ఈ మిరియాల్లో పైపరైన్ అనే పదార్థం ఉంటుంది. ఇది మనం తినే ఇతర ఆహారాల్లోని పోషకాలను శరీరం సులభంగా పీల్చుకోవడానికి సాయపడుతుంది. ఉదాహరణకు పసుపులోని కర్కుమిన్ లాంటివి బాగా ఒంటబడతాయి. ఇది మన ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుంది. శరీరంలోని కొవ్వును కరిగించే ప్రక్రియను నల్ల మిరియాలు వేగవంతం చేస్తాయి. జీవక్రియ చురుకుగా పని చేయడం వల్ల ఎక్కువ కేలరీలు ఖర్చవుతాయి. దీని వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక సహజ మార్గంగా ఉపయోగపడుతుంది. నల్ల మిరియాలకు సహజంగానే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి శరీరంలో వచ్చే వాపును, నొప్పిని తగ్గించడంలో సాయపడతాయి. ఇది కీళ్ళు ఆరోగ్యంగా పని చేయడానికి దోహదపడుతుంది. ఇవి ముక్కులో చేరిన శ్లేష్మాన్ని సులభంగా బయటకు పంపడానికి సాయపడతాయి. జలుబు, దగ్గు వచ్చినప్పుడు శ్వాస మార్గాన్ని శుభ్రం చేసి ఉపశమనం కలిగిస్తాయి. నల్ల మిరియాల్లో యాంటీబ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి మన శరీరాన్ని హానికర బ్యాక్టీరియా నుంచి కాపాడతాయి. ముఖ్యంగా జీర్ణ సంబంధిత ఇన్ఫెక్షన్లు రాకుండా అడ్డుకుంటాయి. ఈ మసాలా దినుసులో ఉండే పైపరైన్ పదార్థం నరాల వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. మతిమరుపు రాకుండా చూడటం.. చురుకుదనం పెరగడం వంటి లాభాలు దీని వల్ల కలుగుతాయి. మానసిక ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఇది సాయపడుతుంది. నల్లమిరియాల్లో శరీరానికి హాని చేసే ఫ్రీ రాడికల్స్ ను ఎదుర్కొనే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. దీని వల్ల కణాలు దెబ్బతినకుండా రక్షించబడతాయి. అలాగే దీర్ఘకాలిక వ్యాధుల నుంచి కూడా రక్షణ లభిస్తుంది. కొంతమంది పరిశోధకుల ప్రకారం నల్ల మిరియాలు శరీరం ఇన్సులిన్ కు బాగా స్పందించేలా చేస్తాయి. ఇది రక్తంలో షుగర్ లెవెల్స్ ను స్థిరంగా ఉంచడానికి సాయపడుతుంది. షుగర్ ఉన్నవారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది. నల్ల మిరియాలు శరీరంలో సెరోటోనిన్, డోపమైన్ వంటి ఆనందాన్ని కలిగించే హార్మోన్ల ఉత్పత్తిని పెంచుతాయి. దీని వల్ల మనసుపై మంచి ప్రభావం పడుతుంది. ఒత్తిడి తగ్గి మనసుకు ప్రశాంతత వస్తుంది.

ఈ మిరియాల్లో పైపరైన్ అనే పదార్థం ఉంటుంది. ఇది మనం తినే ఇతర ఆహారాల్లోని పోషకాలను శరీరం సులభంగా పీల్చుకోవడానికి సాయపడుతుంది. ఉదాహరణకు పసుపులోని కర్కుమిన్ లాంటివి బాగా ఒంటబడతాయి. ఇది మన ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుంది. శరీరంలోని కొవ్వును కరిగించే ప్రక్రియను నల్ల మిరియాలు వేగవంతం చేస్తాయి.

# ఉన్నట్టుండి బరువు తగ్గిపోతున్నారా?



ఎలాంటి కారణం లేకుండానే శరీర బరువు గణనీయంగా తగ్గుతుందా? దీనికి సాధారణ కారణాలు ఉండొచ్చు. కానీ ఎక్కువకాలం ఇలాగే కొనసాగుతుంటే మాత్రం అనుమానించాల్సిందే. కొన్నిసార్లు ఇవి ఇతర ఆరోగ్య సమస్యకు సంకేతం కావచ్చు. అకస్మాత్తుగా బరువు తగ్గడం వెనుక అనేక కారణాలుంటాయని వైద్య నిపుణులు చెప్తున్నారు. బరువు తగ్గాలని చాలామంది కోరకుంటుంటారు. కాని కొందరు మాత్రం ఎలాంటి ప్రయత్నం లేకుండా, కారణం లేకుండా బరువు తగ్గిపోతుంటే అది ఆందోళన కలిగించే విషయం. ఇది మీ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుంది. ఆకస్మికంగా బరువు తగ్గడం వెనుక వివిధ ఆరోగ్య కారణాలుండవచ్చు. ముఖ్యంగా, జీర్ణవ్యవస్థ సంబంధిత సమస్యలు అకస్మాత్తుగా బరువు తగ్గడానికి దారితీస్తాయి. ఉదాహరణకు, క్రోన్స్ వ్యాధి వంటి దీర్ఘకాలిక ప్రేగు సంబంధిత వ్యాధులు పోషకాల శోషణకు ఆటంకం కలిగిస్తాయి. అలాగే, సీలియాక్ వ్యాధి ఉన్నవారిలో గ్లూటెన్ వినియోగం పేగులకు నష్టం కలిగించి, బరువును తగ్గిస్తుంది. థైరాయిడ్ సమస్యలు మరో ప్రధాన కారణం. హైపర్‌థైరాయిడిజం ఉన్నవారు వేగవంతమైన జీవక్రియ కారణంగా వేగంగా బరువు కోల్పోతారు. అలాగే, మధుమేహం (డయాబెటిస్), ముఖ్యంగా టైప్ 1 డయాబెటిస్ ప్రారంభ దశల్లో, శరీరం ఇన్సులిన్‌ను సరిగా ఉత్పత్తి చేయలేక లేదా ఉపయోగించలేక బరువు తగ్గడం జరుగుతుంది. శరీర కణాలు శక్తి కోసం కొవ్వును, కండరాలను బర్న్ చేయడం దీనికి కారణం. తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక ఆరోగ్య సమస్యలు కూడా బరువు తగ్గడానికి కారణమవుతాయి. మానసిక ఒత్తిడి ఆకలిని తగ్గిస్తుంది, ఆహారపు అలవాట్లను మారుస్తుంది. కొన్ని సందర్భాల్లో, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు కూడా అకస్మాత్తుగా బరువు తగ్గడానికి దారితీస్తాయి. కణితి పెరిగేకొద్దీ అది శరీర పోషకాలను వినియోగించుకుంటుంది.

# 2+ కస్టమర్లకు గుడ్‌న్యూస్: రీఛార్జ్‌లపై కొత్త ఆఫర్....



ప్రముఖ టెలికాం ఆపరేటర్ వొడాఫోన్ ఐడియా తమ 2+ హ్యాండ్‌సెట్ వినియోగదారుల కోసం సరికొత్త “వీ గ్యారెంటీ” ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ వినూత్న పథకం కింద, రూ. 199 ఆపై విలువ కలిగిన అపరిమిత ప్రీపెయిడ్ వాయిస్ ప్యాక్‌లపై వినియోగదారులకు సంవత్సరంలో మొత్తం 24 రోజుల అదనపు వ్యాలిడిటీ ప్రయోజనం లభిస్తుంది. వీ గ్యారెంటీ కింద రూ. 199 లేదా అంతకంటే ఎక్కువ విలువ గల ప్రతి అపరిమిత వాయిస్ రీఛార్జ్ ప్యాక్‌పై 2 రోజుల అదనపు వ్యాలిడిటీ కస్టమర్ ఖాతాకు జమ అవుతుంది. ఈ 24 రోజుల అదనపు వ్యాలిడిటీ 12 నెలల వ్యవధిలో క్రెడిట్ అవుతుంది. వాయిస్-మాత్రమే వినియోగించే లేదా తక్కువ డేటా ఉపయోగించే ప్రీపెయిడ్ కస్టమర్‌లు ఎదుర్కొనే దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించడమే వీ గ్యారెంటీ ప్రోగ్రామ్ ప్రధాన ఉద్దేశ్యం. సాధారణ 28 రోజుల ప్యాక్‌లతో, వినియోగదారులు తరచుగా ఒకే క్యాలెండర్ నెలలో రెండుసార్లు రీఛార్జ్ చేయాల్సి వస్తుంది లేదా కొన్నిసార్లు సేవలు అంతరాయం అవుతాయి. “వీ గ్యారెంటీ” పరిచయంతో, కస్టమర్‌లు ఇప్పుడు సాధారణ 28 రోజులకు బదులుగా 30 రోజుల సర్వీస్ వ్యాలిడిటీ పొందుతారు. ఇది ప్రతి నెలా ఒకే రీఛార్జ్‌తో సరిపెట్టుకోవడానికి వీలు కల్పిస్తుంది. 28 రోజుల కన్నా ఎక్కువ వ్యాలిడిటీ గల రీఛార్జ్‌లలో కూడా, అదనపు రెండు రోజులు రీఛార్జ్ సైకిల్‌లోని అంతరాలను తగ్గించి, మరింత సౌలభ్యం, నిరంతర సేవలు అందిస్తాయి.

ఈ వినూత్న పథకం కింద, రూ. 199 ఆపై విలువ కలిగిన అపరిమిత ప్రీపెయిడ్ వాయిస్ ప్యాక్‌లపై వినియోగదారులకు సంవత్సరంలో మొత్తం 24 రోజుల అదనపు వ్యాలిడిటీ ప్రయోజనం లభిస్తుంది. వీ గ్యారెంటీ కింద రూ. 199 లేదా అంతకంటే ఎక్కువ విలువ గల ప్రతి అపరిమిత వాయిస్ రీఛార్జ్ ప్యాక్‌పై 2 రోజుల అదనపు వ్యాలిడిటీ కస్టమర్ ఖాతాకు జమ అవుతుంది. ఈ 24 రోజుల అదనపు వ్యాలిడిటీ 12 నెలల వ్యవధిలో క్రెడిట్ అవుతుంది. 2+ హ్యాండ్‌సెట్ ఉపయోగిస్తూ, రూ. 199, అంతకంటే ఎక్కువ విలువ కలిగిన అపరిమిత వాయిస్ రీఛార్జ్ ప్యాక్‌లు పొందే ప్రీపెయిడ్ కస్టమర్లందరికీ “వీ గ్యారెంటీ” ప్రయోజనం వర్తిస్తుంది. వీ గ్యారెంటీ పథకం కింద, రూ. 199, రూ. 209 విలువ గల రెండు ప్రముఖ ప్యాక్‌లు అదనపు వ్యాలిడిటీ అందిస్తున్నాయి.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు....



పసిడి ప్రియులకు ఇది బ్యాడ్ న్యూస్‌గానే చెప్పాలి. ఎందుకంటే.. ఆషాఢ మాసం పండుగల సీజన్, వచ్చే శ్రావణ మాసం పెళ్లిల కోసం గోల్డ్ కొనుగోలు చేయాలనుకుంటారు చాలా మంది. ఈ నేపథ్యంలో మరోమారు పసిడి పరుగులు పెడుతోంది. దీంతో బంగారం కొనాలని అనుకున్న సామాన్యులు షాక్ అవుతున్నారు. జూన్ నెలఖారు వరుసగా ఏడు రోజులుగా తగ్గిన బంగారం ధర మళ్లీ పెరుగుతోంది. జులై 1 మంగళవారం నుండి బంగారం ధర మళ్లీ పెరిగింది. బుధవారం కూడా గోల్డ్ రేట్ పెరిగింది. జూన్ నెలలో క్రమంగా పడిపోతూ వచ్చిన బంగారం ధరలు నెల చివర్లో భారీ తగ్గుదలను నమోదు చేశాయి. ముఖ్యంగా 24 క్యారెట్ల బంగారం ధర 100 గ్రాములకు రూ. 34,900 దాకా పడిపోవడం చూసిన పసిడి ప్రియులు సంతోషపడ్డారు. హమ్మయ్య ఎట్టకేలకు బంగారం ధరలు శాంతించాయని భావించారు. కానీ, జూన్ 23 నుంచి 30 వరకు అంటే కేవలం వారం రోజుల పాటు గోల్డ్ రేట్ దిగుతూ వచ్చింది. పసిడి ధరలో ఈ భారీ తగ్గింపు జులై ఆరంభంలోనే అమాంతంగా పెరిగింది. జులై 1న పది గ్రాముల బంగారం పై ఏకంగా రూ. 1,140 మేర ధర పెరిగింది. ఆ మర్నాడు జులై 1న బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుదల నమోదు చేసుకున్నాయి. భారతదేశంలో ఈరోజు జులై 2న 24 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ. 9,841, 22 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ. 9,021లు కాగా, 18 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ. 7,381లుగా ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ. 98,560, 22 క్యారెట్ల ధర రూ. 90,360 లుగా ఉంది. కిలో వెండి ధర రూ. 1,10,100 లుగా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల ధర రూ. 98,410, 22 క్యారెట్ల ధర రూ. 90,210 ఉంది. వెండి ధర కిలో రూ. 1,10,100 గా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ. 98,410 లు ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ. 90,210 గా ఉంది. వెండి ధర కిలో రూ. 1,20,100 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ. 98,410, 22 క్యారెట్ల ధర రూ. 90,210 గా ఉంది. వెండి ధర కిలో రూ. 1,10,100 లుగా ఉంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 98,410 ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 90,210 లుగా ఉంది. కిలో వెండి ధర రూ. 1,20,100 గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ. 98,410, 22 క్యారెట్ల ధర రూ. 90,210లుగా ఉంది. వెండి కిలో ధర రూ. 1,20,100 లుగా ఉంది.

# పాస్‌పోర్ట్ సేవల్లో కీలక మార్పులు.. పాస్‌పోర్ట్ జారీ మరింత ఈజీ




ఆధునిక కాలంలో ప్రపంచం కుగ్రామంగా మారింది. ఒక దేశం నుంచి మరో దేశానికి రాకపోకలు విపరీతంగా పెరిగాయి. దానికి అనుగుణంగానే వేల సంఖ్యలో విమానాలు నిత్యం వివిధ దేశాల మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. చదువు, వ్యాపారం, ఉద్యోగం, వివాహం, పర్యటన తదితర కారణాలతో చాలా మంది భారతీయులు విదేశాలకు వెళతున్నారు. ఆ ప్రయాణానికి ముందుగా పాస్ పోర్టు అవసరం. గతంలో పాస్ పోర్టు కావాలంటే నిబంధనల ప్రక్రియ చ్ఛాలా ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం పాస్ పోర్టు సేవ 2.0 అందుబాటులోకి వచ్చింది. ప్రజలకు వేగంగా, సులభంగా సేవలందించడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో ఈ విధానం గురించి మరిన్ని విషయాలు తెలుసుకుందాం. పాస్ పోర్టు సేవ (పీఎస్పీ) 2.0ను విదేశాంగ మంత్రి జై.శంకర్ ఈ ఏడాది జూన్ 24న భారతీయులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. పాస్ పోర్టు సేవా దివస్ సందర్భంగా ఈ కొత్త విధానం అమలు చేశారు.

దీనిలో భాగంగా ఇక నుంచి ఇ-పాస్ పోర్టులను జారీ చేస్తారు. ఇవి కాంటాక్ట్ లెస్ చిప్ ఆధారిత టెక్నాలజీతో పని చేస్తాయి. దరఖాస్తుదారులకు మరింత వేగంగా పాస్ పోర్టు అందించడం, విదేశీ ప్రయాణాన్నివేగవంతం చేయడం, ఇమ్మిగ్రేషన్ ను సులభతరం చేయడం, పోలీస్ యాప్ ధ్రువీకరణ సమయాన్ని ఐదు నుంచి ఏడు రోజులకు తగ్గించడం దీని ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ-పాస్ పోర్టులో సెక్యూర్ ఎంబెడెడ్ చిప్ ను అమర్చారు. దీనిలో వ్యక్తిగత వివరాలన్నీ నమోదు చేస్తారు. వేలిముద్రలు, ఐరిస్ స్కాన్, ముఖ ఛాయాచిత్రం తదితర బయోమెట్రిక్ స్టోరేజీ ఉంటుంది. విమానాశ్రయంలో తనిఖీలు వేగంగా జరుగుతాయి. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసీఏవో) నిర్దేశించిన అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుంది. డేటా ఫోర్జరీ, డూప్లికేషన్ కు అవకాశం దాదాపు ఉండదు. పాస్ పోర్టు సేవా పోర్టల్ ను సందర్శించాలి. భారత ప్రభుత్వం నిర్వహించే అధికారిక వైబ్ సైట్ కు వెళ్లాలి. దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఖాతాను తెరవాలి. ఇప్పటికే ఉన్న వారు పాస్ వర్డ్ ను ఉపయోగించి లాగిన్ అవ్వాలి.

# వారెన్ బఫెట్ గోల్డెన్ రూల్స్...



వారెన్ బఫెట్, ప్రపంచ ప్రఖ్యాత పెట్టుబడిదారుడు. ఆయన మ్యూచువల్ ఫండ్లను నేరుగా నిర్వహించరు కానీ, ఆయన చెప్పిన పెట్టుబడి సూత్రాలు మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టేవారికి ఎంతో ఉపయోగపడతాయి. మార్కెట్ గందరగోళం ఉన్నా ప్రశాంతంగా ఉండటం నుండి అనవసర అంచనాలను వదిలేయడం వరకు, సంపదను ఓపికగా, తెలివిగా పెంచుకునేందుకు బఫెట్ చెప్పిన ఏడు ముఖ్యమైన నియమాలను ఇప్పుడు చూద్దాం. బఫెట్ చెప్పిన ఈ పెట్టుబడి సూత్రాలు స్టాక్ మార్కెట్ కు సంబంధించినవి అయినా, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులకు కూడా ఇవి చాలా విలువైనవి. తక్కువ ఖర్చుతో కూడిన ఇండెక్స్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం, దీర్ఘకాలం పాటు కొనసాగడం, మార్కెట్ హెచ్చుతగ్గుల నుండి ప్రభావితం కాకుండా ఉండటం, క్రమశిక్షణ, ఓపిక పాటించడం వంటి ప్రతి మంత్రం, భయంలో కూడా ప్రశాంతంగా, అత్యాశలో నియంత్రణతో ఉండే వారే నిజమైన సంపదను సృష్టించుకుంటారు అని మనకు బోధిస్తుంది.

వారెన్ బఫెట్ ఎప్పుడూ తక్కువ ఖర్చుతో దొరికే ఇండెక్స్ ఫండ్లనే సిఫార్సు చేస్తారు. పెద్ద మొత్తంలో డబ్బును వసూలు చేసే వాల్ స్ట్రీట్ మేనేజర్లకు లాభాలు వెళ్తాయి కానీ, పెట్టుబడిదారులకు కాదని ఆయన అంటారు. చిన్న పెట్టుబడిదారులు, ఎప్పుడూ మార్కెట్‌ను ట్రాక్ చేయలేని వారికి ఇండెక్స్ ఫండ్లు చాలా మంచివి. చనిపోయిన తర్వాత తన సంపదలో 90 శాతం ఎస్&పి 500 ఇండెక్స్ ఫండ్లలోనే పెట్టాలని ఆయన చెప్పడం, వాటిపై ఆయనకు ఉన్న నమ్మకాన్ని చూపుతుంది. భారతదేశంలో కూడా నిఫ్టీ 50, సెన్సెక్స్ ఇండెక్స్ ఫండ్లు అందుబాటులో ఉన్నాయి. తక్కువ ఖర్చు, పారదర్శకత, స్థిరమైన రాబడుల కోసం ఇవి మంచివి.

“వచ్చే పదేళ్లు మార్కెట్ మూసేసినా మీరు సంతోషంగా ఉంచుకోగలిగే వాటినే కొనుగోలు చేయండి” అనేది బఫెట్ ప్రసిద్ధ సూక్తి. ఇది దీర్ఘకాలిక పెట్టుబడికి ప్రాధాన్యత ఇస్తుంది. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు తక్షణ లాభాల కోసం కాదు. అవి పదవీ విరమణ, పిల్లల చదువులు లేదా సంపద సృష్టి వంటి లక్ష్యాలతో ఉంటాయి. తరచుగా ఫండ్లను మార్చకుండా, మార్కెట్ సమయాన్ని అంచనా వేయకుండా మంచి ఫండ్లను ఎంచుకుని, మార్కెట్ ఎలా ఉన్నా వాటితోనే కొనసాగాలని బఫెట్ సూచిస్తారు. ఓపిక, క్రమశిక్షణ, దీర్ఘకాల ఆలోచనలే సంపద సృష్టించడానికి కీలకం. పెట్టుబడికి మేధస్సు కన్నా క్రమశిక్షణ, నియంత్రణ ముఖ్యమని బఫెట్ అంటారు. “పెట్టుబడిదారులు గుంపు భయం లేదా ఉత్సాహం నుండి తమను తాము వేరు చేసుకోగలగాలి, కొన్ని ప్రాథమిక సూత్రాలపై దృష్టి పెట్టాలి.” మ్యూచువల్ ఫండ్ పెట్టుబడికి కూడా ఇది వర్తిస్తుంది. మీకు పెద్ద డిగ్రీలు అవసరం లేదు. పతనాన్ని తట్టుకునే ఓపిక, క్రమం తప్పకుండా %వాఖ్రా% ల ద్వారా పెట్టుబడులు పెట్టడం, వాస్తవిక అంచనాలతో ఉండటమే కీలకం. సాధారణ వ్యక్తులు కూడా నిలకడగా, క్రమశిక్షణతో ఉంటే అద్భుత ఫలితాలు సాధించగలరు. “మార్కెట్ ను అతి దగ్గరగా చూస్తే హానికరం” అనేది బఫెట్ అభిప్రాయం.

# జీఎస్‌టీ వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లు




ఈ ఏడాది జూన్‌లో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళు వార్షిక ప్రాతిపదికన 6.2 శాతం వృద్ధితో రూ. 1.84 లక్షల కోట్లకు చేరాయి. అయితే, ఈ ఏప్రిల్, మే నెలల్లో నమోదైన రూ. 2 లక్షల కోట్లకు పైగా వసూళ్లతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. 2024 జూన్‌లో జీఎస్‌టీ స్థూల ఆదాయం రూ. 1.74 లక్షల కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ. 2.37 లక్షల కోట్లకు పెరగగా.. మే నెలలో రూ. 2.01 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత నెలలో జీఎస్‌టీ రిఫండ్లు 28.4 శాతం పెరిగి రూ. 25,491 కోట్లకు చేరాయి. దాంతో, జీఎస్‌టీ నికర వసూళ్లు రూ. 1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత జూన్‌తో పోలిస్తే, నికర ఆదాయంలో 3.3 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మే నెలతో పోలిస్తే మాత్రం 8.48 శాతం తగ్గాయి. తొమ్మిదో వసంతంలోకి జీఎస్‌టీ: జీఎస్‌టీ చట్టం అమలులోకి వచ్చి 8 ఏళ్లు పూర్తయ్యాయి. మంగళవారం తొమ్మిదో వసంతంలోకి అడుగుపెట్టింది. జీఎసటీ దేశ ఆర్థిక దృశ్యాన్ని పునర్నిర్మించిన మైలురాయి సంస్కరణ అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా అన్నారు. “నిబంధనల భారాన్ని తగ్గించడం ద్వారా దేశంలో వ్యాపార నిర్వహణను, ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల కార్యకలాపాలను మరింత మెరుగుపరిచింది. అంతేకాదు, ఆర్థిక వృద్ధికి చోదకంగా మారింది” అని ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ (గతంలో ట్విటర్)లో ప్రధాని పోస్ట్ చేశారు. జీఎసటీ ఇకపై సులభతర వ్యాపార నిర్వహణను ప్రోత్సహించడం, పన్ను చెల్లింపుదారుల్లో బలమైన సమ్మతి, ఆర్థిక సమ్మిళితాన్ని పెంపొందించడంపై దృష్టిసారించనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశవ్యాప్తంగా ఏకరీతి పరోక్ష పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు 17 రకాల స్థానిక పన్నులు, 13 రకాల సుంకాల విలీనం ద్వారా రూపొందించిన జీఎసటీ చట్టం 2017 జూలై 1 నుంచి అమలులోకి వచ్చింది.

# ఆసియా ఫ్యాక్టరీల్లో మందగింపు...



ఆసియా ఆర్థిక వ్యవస్థలలోని అనేక ఫ్యాక్టరీల కార్యకలాపాలు మందగించాయి. ఈ ఏడాది జూన్ నెలలో అమెరికా సుంకాల అనిశ్చితి కారణంగా డిమాండ్ తక్కువగా ఉండటంతో స్తబ్దతను ఎదుర్కొంటున్నాయని రాయిటర్స్ ఓ కథనంలో వెల్లడించింది. అయితే ఇటీవల అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చలతో తయారీదారులకు స్వల్ప ఉపశమనం లభించొచ్చని భావిస్తున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలో ఆర్థిక పునరుద్ధరణ అవకాశాలు మందగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జపాన్‌లో కొంత తయారీ కార్యకలాపాలు విస్తరించినప్పటికీ అమెరికా సుంకాల అనిశ్చితి కారణంగా కొత్త ఆర్డర్లు కుంచించుకుపోయాయి. దక్షిణ కొరియాలో ఫ్యాక్టరీ కార్యకలాపాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. మే నెలలో చైనాలో 48.3 నుండి కొత్త ఆర్డర్లలో పెరుగుదల చోటు చేసుకోవడం విశేషం. ”మొత్తంగా జూన్‌లో తయారీ సరఫరా, డిమాండ్ పునరుద్ధరణ అయ్యాయి. కానీ బాహ్య పరిస్థితులు కఠినంగా, సంక్లిష్టంగా ఉన్నాయి. అనిశ్చితులు పెరుగుతున్నాయి.” అని అకైక్సిన్ ఇన్సైట్ గ్రూప్ ఆర్థికవేత్త వాంగ్ జీ పేర్కొన్నారు. భారత్‌లో తయారీ కార్యకలాపాలు 14 నెలల గరిష్ట స్థాయికి చేరుకున్నాయని రాయిటర్స్ పేర్కొంది. ఇది అంతర్జాతీయ అమ్మకాలలో పెరుగుదలను సూచిస్తుంది. మార్చిలో అమెరికా విధించిన సుంకాలు ప్రపంచ వాణిజ్యాన్ని అస్తవ్యస్తం చేసిన విషయం తెలిసిందే. దీర్ఘకాలిక వాణిజ్య సమస్యలు ఇంకా పరిష్కరించబడలేదు.

## సినిమాషో

# కోట్ల లెక్కలు మోస్తున్న వీరమల్లు ట్రైలర్



ఎల్లుండి హరిహర వీరమల్లు ట్రైలర్ రిలీజ్ కాబోతోంది. ఈసారి ఎలాంటి వాయిదా లేదు. జూలై 24 విడుదలలోనూ ఏ మార్పు ఉండదని, ఆ మేరకు డిస్ట్రిబ్యూటర్లకు పక్కా సమాచారం వెళ్లిపోయిందని ఫిలిం నగర్ టాక్. ఏపీ తెలంగాణలో ఎంపిక చేసిన థియేటర్లలో భారీ సెలబ్రేషన్స్ మధ్య ట్రైలర్ లాంచ్ సంబరంగా జరుపుకునేందుకు ఫ్యాన్స్ రెడీ అవుతున్నారు. ఈసారి కొత్త ఉత్సాహంతో జనసేన వర్గాలు కూడా తోడవుతున్నాయి. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సినిమా, అందులోనూ చాలా గ్యాప్ తర్వాత వస్తోంది కనక సెలబ్రేషన్స్ భారీ ఎత్తున ఉండబోతున్నాయి. పీఆర్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ట్రైలర్ మీద వందల కోట్ల లెక్కలు ముడిపడి ఉన్నాయి. ఇప్పటికే బజ్ తగ్గిపోయిన ఈ ప్యాన్ ఇండియా మూవీని ఒక్కసారిగా ఎలివేట్ చేయాల్సిన బాధ్యత ఈ వీడియో మీదే ఉంది. యూనిట్ సభ్యులు, ఇతర దర్శక నిర్మాతలు ప్రైవేట్ గా చూసి అద్భుతమని పొగుడుతున్నారు. అయితే ఆ మాట జూలై 3 కామన్ ఆడియన్స్ నుంచి వస్తే అప్పుడు అసలైన జాతర మొదలవుతుంది. నిర్మాత ఏఎం రత్నం ఇప్పటికే వందల కోట్లు మంచి నీళ్లలా ఖర్చు పెట్టారు. జూలై 24 టెర్రిఫిక్ ఓపెనింగ్ రావాలంటే మొదటి రోజే చూసి తీరాలనే కాంక్ష రగిలించేలా ట్రైలర్ కట్ ఉండాలి. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో బెస్ట్ అనిపించాలి. బిజినెస్ కు సంబంధించిన వివరాలు ఇంకా బయటికి రావడం లేదు. తెలుగు రాష్ట్రాల కొన్ని ఏరియాలకు థియేట్రికల్ హక్కులను ఇంకా విక్రయించలేదని, ట్రైలర్ రాగానే ఈ వ్యవహారాలు ఊపందుకుంటాయని, భారీ రేట్లు వస్తాయని మెగా వర్గాలు ఆశిస్తున్నాయి.

## రామ్ చరణ్ మీద ఎందుకీ రాద్ధాంతం!



సోషల్ మీడియాలో రామ్ చరణ్ మీద పెద్ద చర్చే జరుగుతోంది. ఎన్నడూ లేనిది నిర్మాత దిల్ రాజు సోదరుడు శిరీష్ ఒక ఇంటర్వ్యూ ఇవ్వడం, అందులో గేమ్ ఛేంజర్ డిజాస్టర్ తర్వాత హీరో, దర్శకుడు కనీసం ఒక ఫోన్ కూడా చేయలేదనే రీతిలో కామెంట్ చేయడం ఫ్యాన్స్ లో దుమారం రేపింది. ఒకపక్క తమ్ముడు రిలీజ్ ట్రైలర్ ఈవెంట్ లో దిల్ రాజు మాట్లాడుతూ గిల్ట్ పోగొట్టుకోవడం కోసమైనా చరణ్ తో ఒక హిట్ మూవీ ప్లాన్ చేస్తానని, త్వరలోనే ప్రకటన ఆశించవచ్చని చెప్పడం ఇంకా ఫ్రెష్ గా ఉండగానే ఇంకోవైపు శిరీష్ అన్న మాటలు రకరకాల అర్థాలకు దారి తీశాయి. ఇది అవసరం లేని రాద్ధాంతానికి దారి చూపాయి.ఎవరు ఎలా అనాలిసిస్ చేసుకున్నా గేమ్ ఛేంజర్ జాప్యానికి, ప్రొడక్షన్ కాస్ట్ కి రామ్ చరణ్ బాధ్యుడు కాదనేది ఓపెన్ ఫాక్ట్. దర్శకుడు శంకర్ ఏడు గంటల ఫుటేజ్ తీసి, పాటల కోసమే వందల కోట్లు ఖర్చు పెట్టినప్పుడు దాన్ని కంట్రోల్ చేయాల్సింది ఖచ్చితంగా ప్రొడ్యూసరే.

ఆ మాట దిల్ రాజే ఒప్పుకున్నారు. కండీషన్లు లేకపోవడంతో ఆ ప్యాన్ ఇండియా మూవీ మీద నియంత్రణ పోయిందని బాహాటంగా చెప్పారు. పైగా మూడేళ్ళ విలువైన టైంని ఒక ఫ్లాప్ డైరెక్టర్ కు చరణ్ ఇవ్వడమంటే కథను గుడ్డిగా నమ్మడమే. అది వర్కౌట్ అవుతుందనే నమ్మకంతోనే కదా దిల్ రాజు ఇంత రిస్క్ తీసుకుని ప్రొసీడ్ అయ్యింది. అలాంటప్పుడు నింద ఒకరికే రాదు. ఇంత దారుణమైన రిజల్ట్ కు కారణమైన శంకర్ ఎక్కడో దూరంగా ఉంటే ఆరు నెలల తర్వాత కూడా గేమ్ ఛేంజర్ మీద ఇంకా టాపిక్ జరుగుతూ ఉండటం విచిత్రం. అయినా డిజాస్టర్లు ఇండస్ట్రీకి కొత్త కాదు. ఇంతకు మించినవి ఎన్నో దశాబ్దాలుగా చూస్తూనే ఉన్నాం. నష్టాలు తట్టుకోలేక పరిశ్రమ వదిలి వెళ్ళిపోయినవాళ్ళు, ఒక్క ఫ్లాపుతో జీవితం ఎందుకని భావించిన వాళ్ళు వందల్లో ఉంటారు.

## కన్నప్ప దూకుడుకి బ్రేక్ పడిందా!



అనుమానపడినట్టే నిన్న సోమవారం పరీక్షలో కన్నప్ప తడబడ్డాడు. వీక్ డేస్ లో నెమ్మదించడం ప్రతి సినిమాకు సహజమే అయినా మంచు విష్ణుకి డ్రాప్ శాతం ఎక్కువ ఉందనేది బుకింగ్స్ లో తేటతెల్లమవుతోంది. బిసిలోనే కాదు ఏ సెంటర్స్ లోనూ వసూళ్లు తగ్గాయని ట్రేడ్ నుంచి వస్తున్న రిపోర్ట్. ఇప్పటిదాకా బుక్ మై షోలో అయిదు లక్షల టికెట్లు అమ్మిన కన్నప్ప ఇకపై దూకుడు కొనసాగించడం మీద అనుమానాలు లేకపోలేదు. ఏపీలో పలు కేంద్రాల్లో పది రోజులకు తీసుకున్న యాభై రూపాయల టికెట్ రేట్ పెంపు కలెక్షన్ల మీద ప్రభావం చూపిస్తోందని ఎగ్జిబిటర్స్ టాక్. త్వరగా సాధారణ స్థితికి తేవాల్సిందని అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా కన్నప్ప మళ్ళీ పికప్ కావాలంటే వీకెండ్ దాకా ఎదురు చూడాలి. అయితే ఇక్కడ కొన్ని చిక్కులున్నాయి. శుక్రవారం నితిన్ తమ్ముడు, సిద్దార్థ్ 3 బిహెచ్కె లు మంచి అంచనాలతో థియేటర్లలో అడుగు పెడుతున్నాయి. హాలీవుడ్ మూవీ జురాసిక్ వరల్డ్ రీ బర్త్ సైతం క్లాస్ ఆడియన్స్ ని లాగుతుంది. ఈ నేపథ్యంలో కన్నప్ప అనూహ్యంగా పుంజుకోవడం అనేది కొత్త రిలీజుల ఫలితాల మీద ఆధారపడి ఉంటుంది. ప్రభాస్ పాత్ర ఓపెనింగ్స్ తెచ్చినప్పటికీ లాంగ్ రన్ కు అవసరమైన యునానిమస్ టాక్ తెచ్చుకోవడంలో కన్నప్ప వర్కౌట్ చేయలేకపోయాడు. మిశ్రమ స్పందన వచ్చిన వైనం కళ్ళముందు కనిపిస్తోంది. ఒకవేళ ప్రమోషన్లు ఏమైనా ఫ్రెష్ గా ప్లాన్ చేస్తారేమో చూడాలి. పైరసీ తెచ్చిన ముప్పుని కూడా కొట్టిపారేయలేం. విష్ణు అధికారికంగా 30 వేల లింకులు తీయించామని చెప్పాడు. ఇంకా దొరకనివి ఇంకెన్ని వేలు ఉంటాయో చెప్పలేం.

## 'డెకాయిట్' నుంచి శ్రుతి ఎందుకు తప్పుకుందంటే



టాలీవుడ్లో ఆచితూచి సినిమాలు చేసే నటుల్లో అడివి శేష్ ఒకరు. ఒకప్పుడు చిన్న స్థాయి నటుడిగా ఉన్న శేష్.. 'క్షణం' దగ్గర్నుంచి అద్భుతమైన సినిమాలు చేస్తూ స్టార్గా ఎదిగాడు. శేష్ సినిమా అంటే హిట్ గ్యారెంటీ అనే ధీమా ఇప్పుడు అందరిలోనూ ఉంది. అందుకే తనతో కలిసి పని చేయడానికి ఆర్టిస్టులు, టెక్నీషియన్లు కూడా అమితాసక్తి చూపుతుంటారు.

అలాంటిది శేష్ సినిమా నుంచి శ్రుతి హాసన్ తప్పుకోవడం ఆశ్చర్యం కలిగించింది. వీరి కలయికలో 'డెకాయిల్' సినిమా మొదలై కొంత చిత్రీకరణ కూడా జరుపుకుంది.

కానీ తర్వాత చూస్తే.. శ్రుతి స్థానంలోకి మృణాల్ ఠాకూర్ వచ్చింది.మరి శ్రుతి ఈ సినిమా నుంచి ఎందుకు తప్పుకుంది అన్నది సస్పెన్సే. తాజాగా శేష్ ఈ సస్పెన్సుకి తెరదించాడు. శ్రుతి హాసన్ 'కూలీ' సహా కొన్ని చిత్రాల్లో నటిస్తోందని.. ఆ సినిమాల షెడ్యూళ్లకు, తమ చిత్రానికి క్లాష్ రావడం వల్లే శ్రుతి తప్పుకోవాల్సి వచ్చిందని అతను తెలిపాడు. తమ సినిమా కొంచెం ఆలస్యం కావడంతో శ్రుతి డేట్లు సర్దుబాటు చేయలేని పరిస్థితి వచ్చిందని శేష్ తెలిపాడు. ఇదేమీ ఘర్షణతో తీసుకున్న నిర్ణయం కాదని.. సుహృద్భావ వాతావరణంలో, పరస్పర అంగీకారంతోనే శ్రుతి 'డెకాయిట్' నుంచి తప్పుకుందని శేష్ తెలిపాడు. ఇప్పటిదాకా 'డెకాయిట్' చిత్రీకరణ 60 శాతం పూర్తయినట్లు అతను వెల్లడించాడు. గూఢచారి, వైల్డ్ డాగ్ చిత్రాలకు సినిమాటోగ్రాఫర్గా పని చేసిన షనీల్ డియో 'డెకాయిట్'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. శేష్ దీంతో పాటు 'గూఢచారి' సీక్వెల్ కూడా చేస్తున్న సంగతి తెలిసిందే.

## కండీషన్లకు బిగ్ బాస్ ఓకే....



ప్రపంచవ్యాప్తంగా రియాలిటీ షోలలో కొత్త ట్రెండ్ సృష్టించిన బిగ్ బాస్ తెలుగులో తొమ్మిదో సీజన్ లో ఉండగా కన్నడలో పదకొండు సీజన్లు పూర్తి చేసుకుంది. అయితే పన్నెండో భాగం నుంచి తాను హోస్ట్ చేయనని ఈగ విలన్ కిచ్చ సుదీప్ ఆ మధ్య ప్రకటించడం ఫ్యాన్స్ లో కలకలం రేపింది. మీరే ఉండాలంటూ అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండింగ్ చేశారు. దీంతో సుదీప్ మనసు మార్చుకుని బిగ్ బాస్ 12 పగ్గాలు తీసుకునేందుకు అంగీకరించారు. ఇంత భారీ షో నుంచి ఎందుకు తప్పుకున్నారనే కారణం అడిగితే ఇతర భాషల్లో బిగ్ బాస్ కు దక్కినంత ఆదరణ కన్నడలో లేకపోవడం వల్లే ఆసక్తి తగ్గిందని చెప్పుకొచ్చారు. ఈసారి గేమ్ లో సమూల మార్పులు తెచ్చేందుకు నిర్వాహకులు అంగీకరించడంతో బిగ్ బాస్ 12తో పాటు మరో నాలుగు సీజన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చానని తాజాగా బెంగళూరులో నిర్వహించిన ప్రెస్ మీట్ లో ప్రకటించారు. నిజానికి తెలుగు కన్నా చాలా ముందుగానే కన్నడ బిగ్ బాస్ మొదలయ్యింది. కానీ మనతో పాటు హిందీ, తమిళం అంత పాపులారిటీ సంపాదించుకోలేదు. సెలబ్రిటీల ఎంపిక, పార్టిసిపెంట్స్ పెర్ఫార్మన్స్ లాంటి కారణాలు ఆదరణ తగ్గేలా చేశాయి. దీంతో ఇంత కష్టపడి యాంకరింగ్ చేస్తే ఫలితం లేదని భావించిన సుదీప్ డ్రాప్ అవ్వాలని చూశాడు. కానీ ఫ్యాన్స్ డిమాండ్ మేరకు వెనుకడుగు వేశాడు. మన దగ్గర ఇంత సమస్య లేదు. నాగార్జున హోస్టింగ్ లో రేటింగ్స్ బాగానే వస్తున్నాయి కానీ ఇంకాస్త మెరుగు పడాల్సిన అవసరం చాలా ఉంది. ఫైనల్ ఎపిసోడ్స్ తప్ప మిగిలిన రోజుల్లో టిఆర్పి అంతగా రావడం లేదు. ఈసారి సామాన్యులకు ఛాన్స్ ఇస్తోంది అందుకే.

## వైవిధ్యభరిత ప్రేమకథ....



సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ప్రేమిస్తున్నా'. వరలక్ష్మీ పప్పుల ప్రజెన్స్‌లో కనకదుర్గారావు పప్పుల నిర్మిస్తున్నారు. భాను దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్, ఫస్ట్ సాంగ్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ వేడుకలో సంగీత దర్శకులు భీమ్స్, దర్శకులు అశోక్.జి, అనుదీప్ కె.వి, భాను బోగవరుపు, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. ఇదే వేడుకలో ఐబిఎమ్ మెగా మ్యూజిక్ ఆడియో కంపెనీని లాంచ్ చేయటం విశేషం. ఈ సందర్భంగా నిర్మాత కనకదుర్గారావు పప్పుల మాట్లాడుతూ,'అన్ని ప్రేమకథల్లోనూ ప్రేమ ఉంటుంది. కానీ ఈ ప్రేమకథలో ఆకాశమంత ప్రేమ, అనంతమైన ప్రేమ ఉంటుంది. ప్రేమలో ఇదివరకు ఎవ్వరూ టచ్ చేయని ఒక డిఫరెంట్ పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు దర్శకుడు భాను.

## దుమారం రేపిన బాలీవుడ్ లెజెండ్ పోస్టు



బాలీవుడ్ లెజెండరీ నటుడు నసీరుద్దీన్ షా.. ఇప్పుడో పెద్ద వివాదంలో చిక్కుకున్నారు. ఆయన పెట్టిన సోషల్ మీడియా పోస్టు దుమారం రేపింది. నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ పోస్టును నసీరుద్దీన్ తొలగించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇంతకీ ఏం జరిగిందంటే? ప్రముఖ పంజాబీ నటుడు, సింగర్ దిల్జిత్ దోసాంజ్ హీరోగా తెరకెక్కిన 'సర్దార్జీ-3' చిత్రంలో పాకిస్థానీ నటి హనియా ఆమిర్‌ను కథానాయికగా తీసున్నారు. ఇది గత ఏడాది జరిగిన విషయం. ఐతే కొన్ని నెలల కిందట పహల్గాం ఉగ్రదాడి తర్వాత జరిగిన పరిణామాలు తెలిసిందే. పాకిస్థాన్ నటులు నటించిన సినిమాలను మన వాళ్లు బాయ్‌కాట్ చేస్తున్నారు. అవి విడుదల కాకుండా అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలోనే 'సర్దార్జీ-3' మీద వ్యతిరేకత వచ్చింది. ఐతే ఉద్రిక్త పరిస్థితులకు ముందు తీసుకున్న నిర్ణయాలపై ఇప్పుడేం చేయగలమని టీం అంటోంది.

Printed, Published, Edited, Owned by **MALDE SRISAILAM**, Published from H.No. 10-59, Rajapur, Balanagar, Mahabunagar, PIN - 509202.
and Printed from **MYTHRI ART PRINTERS**, 10 DCC COMPLEX, MAHABUBNAGAR - 509001. **RNI No. TELTEL/2016/69810**, Editor **MALDE SRISAILAM.** Ph: 9849476895